

హైదరాబాద్ వార్త

# నాసిరకం వాచర్ ..డేంజర్

◆ సిటీలో వరుసగా గ్యాస్ లీకేజీ ఘటనలు ◆ దృష్టిసారించని ఆయిల్ కంపెనీలు ◆ రెండేళ్లకోసారి తనిఖీచేయించాలంటున్న నిపుణులు

**హైదరాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త:** నగరంలోని హయత్‌నగర్‌కు చెందిన ప్రసాద్ వంట గ్యాస్ బుక్ చేయడంతో సిలిండర్ డోర్ డెలివరీ అయింది. కొత్త సిలిండర్ రీఫిల్‌కు రెగ్యూలేటర్ అమర్చిన కొన్ని గంటల తర్వాత గ్యాస్ లీకేజీ అవుతున్న వాసన వచ్చింది. పైప్‌ను పరిశీలిస్తే అంతా సవ్యంగా కనిపించింది. రెగ్యూలేటర్ కింద నుంచి గ్యాస్ లీకవుతున్నట్లు గమనించి తక్షణమే దానిని తొలగించి తిరిగి సీల్‌మూత బిగించారు. గ్యాస్ ఏజెన్సీకి ఫోన్ చేస్తే మరుసటి రోజు సంబంధిత నిపుణుడు వచ్చి తనిఖీ చేసి సిలిండర్ నాజిల్‌లోని వాచర్‌ను అమర్చాడు. రూ. 300 ఛార్జీలు వసూలు చేశాడు. సిలిండర్ నాజిల్‌లో వాచర్ సమస్య ఎందుకు వస్తుందని అడిగితే వాచర్ నాసిరకంతోపాటు రెగ్యూలేటర్‌తోనూ సమస్యగా పేర్కొన్నాడు. ఇది ఒక ప్రధాన సమస్యే కాదు... నగరంలోని వేలాది మంది వినియోగదారులు గ్యాస్ లీకేజీ సమస్య ఎదుర్కొంటున్నవారే. కొత్త సిలిండర్ బిగించే సమయంలో రెగ్యూలేటర్, నాబ్‌ల నుంచి గ్యాస్ లీకవుతూ ఉంటుంది. తాజాగా సిలిండర్ నాజిల్‌ని వాచర్ నుంచి లీకేజీలు బయటపడుతున్నాయి. నిపుణులు వచ్చి పరిశీలిస్తే గానీ గుర్తించలేని పరిస్థితి. అప్పటివరకు సిలిండర్ సీల్‌ను మూసి ఉంచాల్సి ఉంటుంది. ఇటీవల ఇలాంటి ఘటనలు సంభవిస్తున్నాయి. నాజిల్‌లో నాసిరకం వాచర్‌లు అమర్చడం లీకేజీలకు కారణమవుతున్నాయని కొన్ని సమయాల్లో రెగ్యూలేటర్ ఒత్తిడితోనూ వాచర్ కదిలి గ్యాస్ లీకేజీ అవుతుందని వారంటున్నారు. సిలిండర్ రీఫిల్ సమయంలోనే ఆయిల్ కంపెనీలు వాటిని పరిశీలిస్తే సమస్య ఉత్పన్నంకాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అయితే కంపెనీలు మాత్రం కేవలం తాత్కాలిక ఉపశమనానికి వాచర్లను మారుస్తుందే తప్ప శాశ్వత పరిష్కారం కోసం చొరవ చూపడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



## లీకేజీకి కారణాలు...

ఎక్కువ శాతం సిలిండర్, స్టౌవ్‌లను కలుపుతూ ఉండే రబ్బర్ ట్యూబ్ ద్వారా లీకేజీలు ఉంటాయి. ఇది అటు సిలిండర్‌కు, ఇటు స్టౌవ్‌కు అతికే ప్రాంతాల్లో ఏదోఒకచోట నుంచి లీక్ అయ్యే ప్రమాదం ఉంది. సాధారణంగా స్టౌకు అనుసంధానించే చోట వేడివల్ల ఈట్యూబ్ సాగేగుణం కోల్పోతుంది. ఫలితంగా పెళుసుదనం సంతరించుకుని పగుళ్లు ఏర్పడతాయి. కేవలం గుండుసూది మొన పరిమాణంలో రంధ్రం ఏర్పడి దీనిలోంచి గంటకు ముప్పావు నుంచి కేజిన్నర వరకు గ్యాస్ లీక్ అవుతుంది. మెల్లమెల్లగా ఇల్లంతా వ్యాపిస్తుంది. ఎల్పీజీకి వ్యాకోచ శక్తి ఎక్కువ, లీకేజీతో వ్యాపించి ఉన్న గ్యాస్‌కు ప్రేరణ లభించగానే ఒక్కసారిగా మంట అంటుకుంటుంది. ఇలా అంటుకున్న సందర్భంలో విస్తరించి ఉన్న గ్యాస్ 12 వేల రెట్లు వ్యాకోచిస్తుంది. అంటే కేజీ గ్యాస్ లీకై ఉంటే.. మంట అంటుకున్న వెంటనే అది 12వేల కేజీల వరకు వ్యాకోచిస్తుంది. ఫలితంగానే గ్యాస్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

## రెండేళ్లకోసారి తనిఖీ చేయించాలి...

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 45 లక్షలకుపైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో ప్రతినెలా 18 లక్షల వరకు రీఫిల్ బుకింగ్‌లు అవుతుంటాయి. ప్రతి నెల 2 వేలకు పైగా కొత్తకనెక్షన్లు తీసుకుంటున్నారు. వినియోగం పెరుగుతున్నంతగా... తనిఖీలు జరగడం లేదు. డిస్ట్రిబ్యూటర్ ఈమేరకు అవగాహన కల్పించడం లేదు. తనిఖీలు చేయింకోవడం ద్వారా ప్రమాదాలు నివారణతో పాటు ఆకస్మాత్తుగా జరిగే ప్రమాదాల్లో నష్టపరిహారం పొందవచ్చు. గ్యాస్ ఏజెన్సీల సమాచారం మేరకు లేదా స్వచ్ఛందంగా వినియోగదారులే రెండేళ్లకోసారి తనిఖీ చేయించాలి. ఇందుకు ఒక్కో ఏజెన్సీ కేవలం రూ.180 నుంచి రూ. 240 వసూలు చేస్తుంది. వినియోగదారులు గ్యాస్ పైపు, లైటర్, రెగ్యూలేటర్, పొయ్యి తదితర వస్తువులు ఐఎస్ఐ మార్క్ ఉన్నవే వాడాలి.



మంటలు చెలరేగుతున్న కారు

## పార్కుచేసిన ఎలక్ట్రిక్ కారులో మంటలు

### స్థానికుల అప్రమత్తంతో తప్పిన పెను ప్రమాదం

**ముషీరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త:** ఇందిరా పార్కు ఎన్టీఆర్ స్టేడియంవద్ద పార్కుచేసి ఉన్న ఎలక్ట్రిక్‌కారులో మంటలు చెలరేగి, పూర్తిగా దగ్ధమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం మధ్యాహ్నం టీఎస్09జీడీ1262 నెంబర్ గల ఎలక్ట్రిక్ కారు ఎన్టీఆర్ స్టేడియం వద్ద పార్కు చేసి, కారులో నుంచి పొగలు రావటం గమనించిన స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి, పక్కన ఉన్న వామనాలను దూరం చేశారు. కొద్దిసేపటికి కారులోనుంచి మంటలు ఎగిసిపడి మొత్తం దగ్ధం అయింది. అక్కడకిచేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సాయంతో మంటలను అదుపుచేశారు. దగ్ధమైన కారుకు పక్కనే మరో కారు పార్కుచేసి, ఉండటంతో ఆ కారు పాక్షికంగా కాలింది. స్థానికుల అప్రమత్తతతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని, మంటలకు గల కారణాలపై కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## కారు ఢీకొని బాలుడికి తీవ్ర గాయాలు

**సైదాబాద్, నవంబరు 16 ప్రభాతవార్త:** కారు అదుపు తప్పి రోడ్డు పక్కన వెళ్తున్న బాలుడిని ఢీకొన్న సంఘటన కాంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. హాఫీజ్‌బాబానగర్‌లో నివాసం ఉండే అమెర్ అలీ(8) స్థానికంగా ఉన్న అలియా గార్డెన్ ఫంక్షన్ హాల్ సమీపంలోని గల్లీలో నడుచుకుంటూ వెళ్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన కారు అదుపు తప్పి ఢీ కొట్టింది. కారును తప్పించుకోవడానికి రోడ్డు పక్కకు పరుగెత్తినప్పటికి వేగంగా రోడ్డు పక్కన దుకాణం ముందున్న మెట్టుపైకి దూసుకు వచ్చి అమెర్ అలీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో బాలుడికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

**పేట్‌బషీరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త :** ఘనపూర్‌కి చెందిన మేకల బాబు (28) కండ్లకొయ్యలోని బిగ్ బాస్కెట్‌లో డ్రైవరుగా పని చేస్తున్నాడు. ఈ నెల తేదీ 15.11.2025 నాడు ఉదయం 09.30 గంటలకు పని నిమిత్తం బిగ్ బాస్కెట్ వెళ్ళి నైట్ ఇంటికి తిరిగి రాలేదు. అనుమనమ వచ్చి అతని భార్య బాబుకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. ఆదివారం ఉదయం 11:30 మళ్లీ ఫోన్ చేయగా వేరే వారు ఫోన్ లిఫ్ట్ చేసి మాకు ఫోన్ దొరికింది అన్నారు. తర్వత మధాహ్నాం 12.25 కాల్ చేసి మీ భర్త డ్యూటిలో ఉండగా, బిగ్ బాస్కెట్‌లోని బాత్రూంలో జారీ పడి చనిపోయాడని తెలిపారు. ఈ విదంగా పొంత లేని సమాదానాలు రావడంతో, ఆమె భర్త మరణంపై అనుమానం ఉన్నట్టు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పేట్ బషీరాబాద్ సిఐ విజయ వర్ధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## హాఫీజ్‌పేట్‌లో భారీ అగ్నిప్రమాదం

**హైదరాబాద్, నవంబరు 16 ప్రభాతవార్త :** హైదరాబాద్ నగరంలోని హాఫీజ్‌పేట్‌లో ఆదివారం తెల్లవారు జామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికంగా ఉన్న రుమాన్ హోటల్‌లో అగ్నికీలలు ఎగిసి పడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం సంభవించినట్లు మాదాపూర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది పేర్కొన్నారు. వంట గదిలో నూనె ఉండడం కారణంగా మంటలు త్వరగా వ్యాపించాయన్నారు. మంటలను అదుపు చేసేందుకు రెండు గంటలు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. కిచెన్‌లో ఉన్న పదార్థాలన్నీ పూర్తిగా కాలిపోయాయి. భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు యజమాని పేర్కొన్నాడు.





బెంగుళూరులో జరిగిన వరల్డ్ పవర్ లిఫ్టింగ్ జాతీయ పోటీల్లో పసిడి పతకాన్ని సాధించిన గంధంగూడా వాసి నారా శశాంక్

## జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో శశాంక్‌కు పసిడి పతకం

**నార్సింగి, నవంబరు 16 ప్రభాతవార్త :** ఇటీవల బెంగళూరులో జరిగిన వరల్డ్ పవర్ లిఫ్టింగ్ నేషనల్స్ చాంపియన్‌షిప్‌లో గండిపేట మండలం గంధంగూడకు చెందిన యువకుడు పసిడి పతకాన్ని సాధించాడు. నారా నాగరాజు, అర్చనల కుమారుడైన నారా శశాంక్ పవర్ లిఫ్టింగ్ క్రీడను సాధన చేస్తున్నాడు. ఇటీవల కర్నాటకరాష్ట్రం బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని 56 కేజీల విభాగంలో రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అలాగే ఎస్బీడీ, స్క్వాట్‌లో 115 కేజీలు, బెంచ్‌లో 75 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 170 కేజీలు ఎత్తి ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఓవరాల్‌గా డెడ్‌లిఫ్ట్‌లో మొదటి స్థానంలో నిలిచి స్వర్ణ పతకంను సాధించాడు. కొన్నేళ్లుగా రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటాడు. ఇప్పుడు జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటుకుంటున్నాడు. జాతీయ స్థాయి పోటీల్లో గోవా, అస్సాం, జార్ఖండ్, తెలంగాణ, కర్నాటక, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. పసిడిపతకంను సాధించిన శశాంక్‌ను గంధంగూడకు చెందిన పుర ప్రముఖులు అభినందించి, ఆశీర్వదించారు.

# గ్రేటర్ కాంగ్రెస్‌కు అడ్డాగా మారుతుందా..!

* రెండు ఉప ఎన్నికల ఓటమితో షాక్‌లో ఉన్న బిఆర్ఎస్ * నేతల స్థైర్యం దెబ్బతీస్తున్న కుటుంబ కలహాలు

**హైదరాబాద్, నవంబర్ 16 ప్రభాతవార్త :** గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ నగరంలో గట్టి పట్టు సాధించిన బిఆర్ఎస్ రానురాను పట్టుకోల్పోతుందా అంటే అవుననే సమాధానం వస్తోంది. వచ్చే జిహెచ్ఎంసి, అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావాలని కలలుగంటున్న ఆ పార్టీ ఈ ఫలితాన్ని ఎలా చూస్తోంది? ఈ ఉప ఎన్నిక నిజంగా గుణపాఠమేనని మాట్లాడుకుంటున్నాయట పార్టీ వర్గాలు. ఏవో పెద్ద పెద్ద మాటలు మాట్లాడేసి గాల్లో మేడలు కడితే సరిపోదని, గ్రౌండ్ రియాలిటీ తెలిసుండాలంటూ పార్టీలోనే నాయకత్వానికి చురకలంటించే వాళ్లు పెరుగుతున్నారు. దీనికి ఎవరి పైనో నెపం నెట్టేసి తప్పుకోవాలని అనుకోవడం కరెక్ట్ కాదని, లోపం ఎక్కడుందో కనుక్కుని సరిచేసుకుంటేనే రేపు వచ్చే జిహెచ్ ఎంసి ఎన్నికల్లో ప్రభావం చూపగలుగుతామని అంటున్నారు. తెలంగాణ ఉద్యమ సమయం నుండే ఎన్నికలు ఎప్పుడు వచ్చినా విజయం తమదేనని చెప్పుకునే బిఆర్ఎస్ రానురాను పట్టు సాధించడంలో విఫలమవుతోంది. ఏ ఎన్నికలు వచ్చినా విజయం మాదేనంటూ చెప్పుకునే ఆ పార్టీ నేతలు ఇప్పుడు ఆ ధైర్యంతో విజయం మాదేనని చెప్పలేకపోతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో అధికారం కోల్పోయాక ఆ పార్టీ పరిస్థితి తిరగబడినట్లయింది. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం చేజిక్కించుకోలేకపోయామని ఆ పార్టీ నేతలు భావిస్తుండగా తాజా పరిణామాలు మరింతగా దిగజారాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల అనంతరం 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కనీసం ఒక్క సీటూ దక్కించుకోలేకపోయింది. పార్టీ అవిర్భావం నుంచి ఒక్క పార్లమెంట్ సీటు దక్కించుకోలేకపోవడం మొదటిసారి. సారు కారు 16అని గొప్పగా ప్రచారం జరుపుకున్న బిఆర్ఎస్ కుప్పకూలిపోయింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెచ్చుకున్న ఓట్లను కూడా తెచ్చుకోలేకపోయింది.





### వరుస ఓటములతో...

2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఓటమిని చవిచూసిన బిఆర్ఎస్ ఆ తర్వాత వరుసగా పరాజయాలను పొందుతోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకోలేకపోయిన కాంగ్రెస్ పార్టీ జరిగిన రెండు అసెంబ్లీ స్థానాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో పరాజయం పాలైంది. కంటోన్మెంట్ అప్పటి మహిళా ఎమ్మెల్యే కారు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో బిఆర్ఎస్ అభ్యర్థి ఓటమి పాలైంది. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ విజయం సాధించారు. తాజాగా జూబ్లీహిల్స్ అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికలోనూ కాంగ్రెస్ అభ్యర్థి ఘన విజయం సాధించారు. ఈ రెండు ఉప ఎన్నికల్లోనూ అధికార కాంగ్రెస్ గెలిచి మరింత బలపడితే, వరుస ఓటములతో బిఆర్ఎస్ డీలా పడింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ నగరం, చుట్టు ఉన్న నియోజకవర్గాల్లో సగానికి పైగా గెలిచిన బిఆర్ఎస్ క్రమంగా ఇక్కడ పట్టు కోల్పోతోందనే అభిప్రాయాలు బలంగా వినపడుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి కాకుండానే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా బిఆర్ఎస్ అనేక రకాలుగా ప్రయత్నించినప్పటికీ ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపడంతో బిఆర్ఎస్ వర్గాల్లో అసంతృప్తులు నెలకొంటున్నాయి. కాంగ్రెస్ విజయాలు సాధించడం పట్ల బీఆర్ఎస్ స్వయం కృతంగా బీఆర్ఎస్‌లో కూడా కొందరు నేతలు భావిస్తున్నవారు ఉన్నారు.

### కుటుంబ కలహాలే కారణమా...

బిఆర్ఎస్ పరిస్థితిని పక్కనపెడితే హైదరాబాద్ నగరంలో ఎంఐఎం గెలిచిన సీట్లు పోగా మిగిలిని 16 సీట్లలో బిఆర్ఎస్ విజయం సాధించిన విషయం తెలిసిందే. అంతలా పట్టున్న హైదరాబాద్ నగరంలో ఇప్పటికే జరిగిన రెండు ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ రెండు సీట్లను కోల్పోవడం నగరంలో బీఆర్ఎస్ ప్రభావం తగ్గిందన డానికి నిదర్శంగా చెప్పుకోవచ్చు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్‌కు 87.53 లక్షల ఓట్లు రాగా ఆ తరువాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 36.48 లక్షల ఓట్లు వచ్చాయి. తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో మరింతగా ఓట్లు తగ్గిపోయాయి. ఇందుకు గల కారణాలను విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. ముఖ్యంగా కుటుంబ కలహాలు బిఆర్ఎస్‌కు తలనొప్పి వ్యవహారంగా మారిందని, దీనికి తోడు పార్టీ ముఖ్య నేతల ఓవర్ కాన్ఫిడెన్స్ ప్రధాన కారణంగా అంచనావేస్తున్నారు. కొందరు నేతలు, కార్యకర్తలు వర్గాలుగా విడిపోవడం ఒక కారణంగా చెప్పుకుంటున్నారు. వీటన్నిటిని కాంగ్రెస్ పార్టీ వినియోగించుకోవడంలో విజయం సాధించినట్లు చెప్పుకుంటున్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి తమ చలవేనని గొప్పగా చెప్పుకునే బిఆర్ఎస్ నగరంలో పట్టును కోల్పోయిందని తెలుసుకుంటుందాని బిఆర్ఎస్ నేతలు చెప్పకుంటున్నారు. ఇప్పటికే ఇక్కడ జరిగిన రెండు ఉప ఎన్నికలు బీఆర్ఎస్‌కు బిగ్‌షాక్ నిచ్చాయి. కాగా నగరానికి చెందిన మరికొంత మంది ఎమ్మెల్యేలు జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలను చూసి కండువాలు మార్చుకునే దిశగా సమాలోచనలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికలపై బెంగపెట్టుకున్న కొందరు బిఆర్ఎస్ కార్పొరేటర్లు సైతం గొడ దూకేందుకు సిద్ధమవుతున్నట్లు ఆ పార్టీ నేతలే పేర్కొంటుండడం గమనార్హం.

# ఘనంగా భగవాన్ బిర్సా ముండా జయంతి



కొమ్ములు ధరించిన సావిత్రి ఠాకూర్, రామచంద్రరావు తదితరులు



ట్యాంక్‌బండ్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ గిరిజనులు

**హైదరాబాద్, నవంబరు 16 ప్రభాతవార్త**

స్వాతంత్ర్య సమరయోధుడు,ఆదివాసీల ఆరాధ్య దైవం భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా ఆదివారం ట్యాంక్‌బండ్‌లోని వివేకానంద విగ్రహం నుంచి కుమురం భీమ్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కేంద్ర మంత్రి సావిత్రిఠాగూర్ పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం కొమ్ములు ధరించిన కేంద్ర మంత్రి సావిత్రి ఠాకూర్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు కళాకారులతో ఫొటోలు దిగారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్య దర్శి డాక్టర్ గౌతంరావు, పార్టీ నేతలు చింతల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



బాలోత్సవ్‌లో కళాకారిణి విద్మహే కూచిపూడి నాట్యవిన్యాసం

## పిల్లల్లో కళాతృష్ణను ప్రోత్సహించాలి

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

### బాలోత్సవ్‌లో వెల్లివిరిసిన విద్మహే కూచిపూడి నాట్యవిన్యాసం

**రవీంద్రభారతి, నవంబరు 16 ప్రభాతవార్త :** పిల్లల్లో నిగూఢమైన కళాతృష్ణ, సృజనాత్మకతను ప్రోత్సహించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సూచించారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని, మనోధైర్యాన్ని, మానసికోల్లాసాన్ని పెంచేందుకు కళలు ఎంతగానో తోడ్పడుతాయని, అందుకు నిదర్శనమే కళాకారిణి విద్మహే ప్రియాంశు తదితర చిన్నారుల నాట్యవిన్యాసమేనని స్పష్టం చేశారు. నృత్యమాల, సిరి ఆర్ట్స్ వంటి కళాసంస్థలు ఇలాంటి దేశ ఖ్యాతిని పెంచే కార్యక్రమాలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. జాతీయ బాలల దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో కన్నులపండువగా నిర్వహించిన బాలోత్సవ్ 2025లో నీలం ప్రియచరణ్, విజయహాసిని దంపతుల తనయ చిన్నారి నీలం విద్మహే ప్రియాంశు శ్లోకంపై కూచిపూడి నృత్యరీతిలో అద్భుతంగా ప్రదర్శించిన నాట్యవిన్యాసం విచ్చేసిన అశేష ప్రేక్షకులను అబ్బురపరచి హర్షద్వానాల మధ్య ప్రశంసలు, శుభాశీస్సులు అందుకుంది. పెద్దపల్లి నటరాజ్ క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ నృత్యగురువు శ్రీపతి శ్రీదేవి వద్ద కూచిపూడి నృత్యంలో సంపూర్ణ శిక్షణపొందిన విద్మహే శాస్త్రీయ శృతి లయబద్ధంగా అద్భుత హావభావ ప్రతిభానర్తన అంబరాన్నంటింది. చివరిగా పలువురు నాట్యగురువులను ఆర్.కృష్ణయ్య, దైవజ్ఞశర్మ, వీరేష్‌యాదవ్ తదితరులతో కలిసి ఘనంగా సత్కరించి కళాకారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

# పత్రికలు ప్రమాణాలు పాటించాలి

* జర్నలిస్టులు వార్తలు, వ్యాఖ్యలకు మధ్య తేడా తెలుసుకోవాలి * మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**సైఫాబాద్, నవంబరు 16 ప్రభాతవార్త:** జర్నలిస్టులు వార్తలు, వ్యాఖ్యలకు మధ్యగల తేడాను తెలుసుకోవాలని,వ్యక్తిగతమైన అభిప్రాయాలను రాయరాదని, స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన జర్నలిస్టులు దేశ పునర్ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సూచించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పత్రికలు ప్రముఖ పాత్రను పోషించాయని, నేటి యువతరం జర్నలిస్టులు నైతిక విలువలు కలిగియుండాలన్నారు. వయోధిక పాత్రికేయుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రముఖ పాత్రికేయులు జి.కృష్ణ గ్రంథం 'అప్పుడు ఇప్పుడు', 'సీనియర్ జర్నలిస్టుల జ్ఞాపకాలు'లను వెంకటయ్యనాయుడు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ గ్రంధాలను ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందని, ఆనాటి సామాజికి, ఆర్థిక, రాజకీయ పరిణామాలన్ని కళ్ల ముందు కదలాడాయన్నారు. పాత్రికేయ వృత్తి ఎంతో ముఖ్యమైనదని, క్లిష్టమైనదని, కత్తిమీద సాములాంటిదని, ఎంతటి భాధ్యతాయుతమైనదో ఈ గ్రంధాల ద్వారా తెలుసుకోవచ్చునని చెప్పారు. పత్రికా రంగలో మార్పులను మేధావుల అనుభవాలను రికార్డు చేసిన కృషి అభినందనీయమన్నారు. నేటి తరం పాత్రికేయులు మీడియా రంగంలో ఉన్న వారు తప్పనిసరిగా ఈ గ్రంథాలను చదవాలని సూచించారు. గతం లేనిదే వర్తమానం లేదని, వర్తమానంలేనిదే భవిష్యత్తు లేదన్నారు. ఈ రెండు గ్రంథాలు రిఫరెన్సులుగా నిలుస్తాయని, పాతతరం జర్నలిస్టుల అనుభవాలు, విలువలు, వారు ఎదుర్కొన్న సవాళ్ళు నేటి యుతకు సూర్తినిస్తాయని చెప్పారు. తాను రాజకీయాల్లో లేనని, రాజకీయ నాయకులు బూతులు మాట్లాడితే పత్రికలు కూడా ఆదేవిధంగా రాయడం మంచిదికాదన్నారు. జర్నలిస్టులు సానుకూలదోరణి కలిగియుండాలని, నెగిటివ్ దోరణి కలిగియుండరాదని, ప్రకృతిని పరిరక్షించే బాధ్యతను పత్రికలు తీసుకోవాలని, మంచి పనులు చేసిన వారిని గుర్తించాలని సూచించారు. సోషల్ మీడియా యాంటి సోషల్ మీడియాగా మారిందని, బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. ఈ సభలో సంఘం అధ్యక్షుడు దాసు కేశవరావు అధ్యక్షత వహించగా, ఆత్మీయ అతిధులుగా కె. రామచంద్రమూర్తి, ఎస్.వెంకటనారాయణ, రాజ శుక, కె.లక్ష్మణరావు, ఉదయవర్లు పాల్గొన్నారు.



జి.కృష్ణ, సీనియర్ జర్నలిస్టుల రెండు గ్రంథాలను ఆవిష్కరించిన వెంకయ్యనాయుడు, పాత్రికేయులు

## జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో భారీ అగ్ని ప్రమాదం

**హైదరాబాద్, నవంబరు 16 ప్రభాతవార్త :** నగరంలోని జవహర్‌నగర్ డంపింగ్‌యార్డ్ సమీపంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. శాంతినగర్ పరిసర ప్రాంతంలోని ఖాళీ ప్రదేశంలో వేసిన వ్యర్థాలను నిప్పంటించడంతో మంటలు వ్యాపించి ఈ ప్రమాదం జరిగింది. ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సుమారు 3 గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



నృత్య కళాకారులను సత్కరించిన దృశ్యం

## సామాజిక భావాలను ప్రజలకు చేరవేయాలి

**చిక్కడపల్లి నవంబరు 16 ( ప్రభాతవార్త):** నృత్యం ద్వారా సామాజిక ప్రయోజనంతో కూడిన భావాలను ప్రజలకు చేరవేయాలని కొవిదా ఆర్ట్ అండ్ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు పి.అనుహ్యారెడ్డి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చినుకు ఫైన్ ఆర్ట్స్ అకాడమీ, తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం టిపిఎస్‌కె అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, చినుకు ఫైన్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు పిఎన్ మూర్తి అధ్యక్షతన ఇండియన్ డాన్స్ హెరిటేజ్ ఫెస్టివల్ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..శాస్త్రీయ నృత్యాలు ఆనందించడం కోసం కాదని, సామాజిక ప్రయోజనంతో కూడిన భావాన్ని ప్రజలకు అర్థం చేయించగలగాలని అన్నారు. పిఎన్ మూర్తి మాట్లాడుతూ.. భరతనాట్యం, కూచిపూడి లాంటి నృత్యాలను అర్బన్ స్ట్రీట్ స్టైల్లోకి తీసుకురావాలన్నారు. నృత్యాలు ప్రదర్శించిన పిల్లలందరికీ సర్టిఫికెట్ మెమోంటోలిచ్చి అభినందించారు. నృత్య గురువులకు గురువందనం జరిగింది. ఈ కార్యక్రమంలో లైన్ శ్రీరామ్, దత్తు, డా. పి జానకి దేవి, ఆచార్య ఘంటసాల పవన్ కుమార్, ఆచార్య చినుకు కోర్ గ్రూప్ జి లావణ్య, కె రామలక్ష్మి ్మ, డి రాధిక, శ్రీనివాస్, కె స్వర్ణలత, ఎ అనుదీప్తి, సిహెచ్ వీరభద్రరావు, అరుణ, శ్రీనివాస్, లక్ష్మీ ్మదేవి పాల్గొన్నారు.

## గుర్తింపునకు నోచుకోని తొలి స్త్రీవాద రచయిత్రి హేమలత
### సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి



నాగ రంజనికి పురస్కారం ప్రదానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి నవంబర్ 16 ( ప్రభాతవార్త):** స్త్రీవాదం తెలుగు సాహిత్యంలో మొదలు కాని రోజుల్లోనే ప్రచారానికి నోచుకుని తొలి స్త్రీవాద రచయిత్రి తెన్నేటి హేమలత అని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం త్యాగరాయ గానసభలోని లలిత కళావేదికపై వంశీ ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో మహా రచయిత్రిగా తెన్నేటి హేమలత 90వ జయంతి సందర్భంగా సాహితీ పరిశోధకులు డాక్టర్ టివి నాగరంజనికి పురస్కారం ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ నరసింహారెడ్డి పురస్కారం బహుకరించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం, వంశీ రామరాజు, ఉగాండా నుంచి వచ్చిన బి వ్యాస కృష్ణ ,హాంగ్ కాంగ్ నుండి వచ్చిన జయ ,డాక్టర్ తెన్నేటి సుధ పాల్గొన్నారు సుంకరపల్లి శైలజ సుధా మయి కార్యక్రమ నిర్వహణ చేశారు.

## రోడ్ల అభివృద్ధికి చర్యలు : కార్పొరేటర్



మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

**చిక్కడపల్లి నవంబరు 16 (ప్రభాతవార్త):** గాంధీనగర్ డివిజన్‌లో రోడ్ల అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా అమలు చేస్తున్నట్లు కార్పొరేటర్ ఏ.పావని వినయ్‌కుమార్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని ఆరు ప్రాంతాలలో చేపట్టిన నూతన విడిసిసి రోడ్డు పనులను జిహెచ్ ఎంసి అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యవేక్షించారు. కెనరాబ్యాంక్, అబ్బాయి టిఫిన్స్, సూరజ్ ఫాస్ట్‌ఫుడ్, మలయాళం చర్చ్, లేబర్ ఆఫీసు,టెలిఫోన్ ఎక్స్చేంజి ప్రక్కన లేన్ల వద్ద చేపట్టిన నూతన విడిసిసి రోడ్డు, ప్యాచ్‌వర్క్ పనులను పర్యవేక్షించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వీటితో పాటు డివిజన్‌లో పెండింగ్‌లో వున్న మరికొన్ని రోడ్డు నిర్మాణం పనులను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్స్పెక్టర్ మహేష్, బిజెపి సీనియర్ నాయకులు దామోదర్,శ్రీకాంత్ ఎం.ఉమేష్,సురేష్ రాజు ,మహమూద్, ఆనంద్ రావు, సాయి కుమార్,జ్ఞానేశ్వర్,.. తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వరాభిషేకం స్వర్ణోత్సవం..

**కూకట్‌పల్లి, నవంబరు 16, ప్రభాతవార్త :** స్వరాభిషేకం ఆర్గనైజర్ ఫౌండర్ అడ్మిన్ శ్రావ్య శృతి ఆధ్వర్యంలో స్వరాభిషేకం స్వరోత్సవం కార్యక్రమం కూకట్‌పల్లిలోని ప్రేకాస స్టూడియోలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కరవోకే సింగింగ్ మీట్ 2025 కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్ట్, అధ్యక్షులు తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి, రాష్ట్ర మీడియా సెల్ బి.వెంకటేశ్వర్లు హాజరయ్యారు. గాయకులు పలువురు తన గాన, గంధర్వ, కంఠంతో శ్రోతలను ఉర్రూతలూగించారు. ఈ సందర్భంగా ఉప్పు సత్యనారాయణ మాట్లాడుతూ ఆధ్వర్యంలో స్వరాభిషేకం స్వర్ణోత్సవం కరవోకే సింగింగ్ మీట్ 2025 కార్యక్రమం స్వరాభిషేకం ఆర్గనైజర్ ఫౌండర్, అడ్మిన్ శ్రావ్య శృతి నల్లూరి అద్భుతంగా నిర్వహించారని కొనియాడారు. కరవోకే సింగింగ్ మీట్ 2025 కార్యక్రమంలో సీనియర్ గాయకుల నుంచి అందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని మధురమైన గానాలను ఆలపించి మానసికోత్సవాన్ని, ఉల్లాసాన్ని కలిగించారని కొనియాడారు. ఇదిలా ఉండగా స్వరోత్సవం కార్యక్రమం 2025 పర్ఫార్మర్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికైన ప్రముఖ సింగర్ ఎన్నారై దివ్య సుర్నిదికి ఘన సత్కారం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిఎస్‌టి జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు, సంతోష్, అవుగన నాగభూషణ్, జనవిగ్నేష్ శ్రీనివాస్ రెడ్డి, ఉష, రిటైర్డ్ ఆఫీసర్ రామకృష్ణ, వినయ్, కార్తికేయ, నరహరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వరాభిషేకం 8వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఆర్గనైజర్, ఫౌండర్, అడ్మిన్ శ్రావ్య శృతి ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి అట్టహాసంగా నిర్వహించారు. శ్రావ్య శృతి, పెర్ఫార్మర్ ఆఫ్ ది ఇయర్ ఎన్నారై దివ్యసుర్నిది, జర్నలిస్ట్ బి.వెంకటేశ్వర్లు, గాయకులను టీం స్వరాభిషేకం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఇదిలా ఉండగా స్వరాభిషేకం స్వరోత్సవం కార్యక్రమానికి ప్రేకాస స్టూడియో అధినేతలు ప్రేమ్, సబిత మట్ల అమూల్యమైన సహకారాన్ని అందించారు.




స్వరాభిషేకంలో పాల్గొన్న శ్రావ్యశృతి నల్లూరి, సబిత, సత్యనారాయణ

# నేటి మనిషి జీవన విధానంలో వచ్చిన మార్పులే వ్యాధులకు కారణం

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**తార్నాక, నవంబరు 16 ప్రభాతవార్త :**
మధుమేహం నియంత్రణ, నిరోధం పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న కుదిరాం మెమోరియల్ కంపాస్ ట్రస్ట్ సేవలు ఎంతో గొప్పవని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కుదిరాం మెమోరియల్ డయాబెటిక్ కంపాస్ ట్రస్ట్ అండ్ కందర్ దయాబెటిస్ సెంటర్ డా. దిలీప్‌కుమార్ కందర్ ఆధ్వర్యంలో ప్రపంచ డయాబెటిస్ దినం సందర్భంగా తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ సౌజన్యంతో ఆదివారం ఉచిత మెగా డయాబెటిక్ హెల్త్ అండ్ ఒబెసిటీ స్క్రీనింగ్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి కిషన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ నేటి మనిషి జీవన విధానం, ఆహారంలో వచ్చిన మార్పులే దీర్ఘకాలిక వ్యాదులకు కారణం అన్నారు. అంతకు ముందు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు, నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, మాజీ మేయర్ బండ కార్తిక చంద్రా రెడ్డి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి హాజరై ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని డా.దిలీప్ కుమార్‌ను అభినందించి ఇలాంటికార్యక్రమాలు పేదలకు ఎంతో మేలు జరుగుతాయన్నారు.అనంతరం కందర్ డయాబెటీస్



దయాబెటిక్ స్క్రీనింగ్ క్యాంప్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సెంటర్ డా. దిలీప్ కుమార్ కందర్ మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా సేలందిస్తున్నామన్నారు. ఒక్క రోజే సుమారు 800 మందికి సేవలందించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిం దన్నారు. డయాబెటిస్, ఒబెసిటీ స్క్రీనింగ్, వైద్య సలహా, జీవనశైలి, ఆహార సంబంధి సూచనలు, మానసిక ఒత్తిడి నిర్వహణ సహాయం వంటి సమగ్ర సేవలు అందించారు. ఆరోగ్యపరమైన, మానసిక, సామాజిక అంశాలనూ వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పించడమే లక్ష్యం అన్నారు. సమాజ సేవకు అంకితభావంతో తెలంగాణ వ్యాప్తంగా నెలకు ఒకసారి ఉచిత క్యాంపులు నిర్వహిస్తూ వస్తున్నామని, ప్రజలకు తాము నిరంతరం వెళ్లి స్క్రీనింగ్, ఆరోగ్య విద్యను అందిస్తున్నామని చెప్పారు. దీని వలన గ్రామాణ ప్రజలు సముచిత డయాబెటిస్ సంరక్షణ పొందుతున్నారని చెప్పారు.డయాబెటిస్‌ను కేవలం రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడం అని మాత్రమే చూడాల్సిన అవసరం లేదని శారీరక, మానసిక, భావోద్వేగ సంకల్పాలను కూడా పరిగణలోకి తీసుకొని సంపూర్ణ రీతిలో రోగిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు సరికొత్త అవగాహన, ముందస్తు నిరోధక చర్యలు, నిత్య జీవన విధానంలో మార్పులు తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డా.మోహన్‌రావు, ఆర్ఎస్ఎస్‌డిఐ తెలంగాణ చాప్టర్ డా. ఉదయ్ లాల్, మొనాలిసా, బధూరి, రాంమోహన్‌రెడ్డి, శోభకరరావు, ప్రొ.కూన అపర్ణ, ప్రొ.మహ్మద్ రియాజ్, డా.శివధర్, డా.కిరణ్ బండ, డా. సురేష్ కుమార్, డా. వరప్రసాద్, డా.వంశీ కృష్ణ, డా. కృష్ణారావు, జస్మంత్ పటేల్,బిజేపీ నాయకులు పోచయ్య యాదవ్, వెంకటేష్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, గణేష్ ముదిరాజ్,మల్లి కంటి వీరన్న, బండ శివారెడ్డి



గ్రంథాలను ఆవిష్కరిస్తున్న పద్మశ్రీ కొలకలూరి ఇనాక్

## కవిత్వ శిక్షణా కార్యాశాలల సంఖ్య పెరగాలి
### పద్మశ్రీ కొలకలూరి ఇనాక్

**చిక్కడపల్లి, నవంబరు 16(ప్రభాతవార్త):** యువకవులకు కవితా నిర్మాణాలపై శిక్షణనివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ పిలుపునిచ్చారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్, విమలా సాహితీ సమితి ఆధ్వర్యంలో నగరంలోని యువకవులకు "ఆధునిక వచనకవితా నిర్మాణ పద్ధతులపై"శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డా.జెల్ది విద్యాధర్ రాసిన కోహినూర్, ముసాఫిర్ తెలుగు కవితా సంపుటాల ఆంగ్లానువాద గ్రంథాలను కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. డా.విద్యాధర్ గొప్ప ప్రేమతత్వంతో,మానవీయ కోణంలో రాసిన కవితా సంపుటాలను ఎంతో సృజనాత్మక ప్రతిభతో అనువాదకులు కొండపాక రవీంద్రాచారి ఆంగ్లంలో అనువదించడం అభినందనీయమన్నారు. తెలుగు కవిత్వానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావాలనే డా.జెల్ది విద్యాధర్ కవిత్వాన్ని ఆంగ్లంలోకి అనువదించానని రవీంద్రాచారి అన్నారు. ప్రముఖ కవి, కళారత్న డా.బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ ఖికవిత్వ కార్యశాలలో ప్రపంచ కవితా నిర్మాణాలపై బిక్కి కృష్ణ, ఆధునిక కవిత్వం వస్తు వైవిధ్యం పై డా.నాళేశ్వరం శంకరం,వచన కవిత్వం అభివ్యక్తి నవ్యతపై శైలజామిత్రలు శిక్షణనిచ్చారు. డా.పి.విజయలక్ష్మి ్మ పండిట్ కవిత్వంపై కీలకో పన్యాసం చేశారు. బిక్కి కృష్ణ రాసిన ఖికవిత్వం డిక్షన్ ఖిపుస్తకాన్ని డా.రాధా కుసుమ పరిచయం చేశారు.పద్మశ్రీలత వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కవిత్వకార్యశాలలో అనేక కమంది కవులు పాల్గొని తమ కవితలు వినిపించారు. వాటిని శిక్షకులు విశ్లేషించి కవులను అభినందించారు.

## బిర్సా ముండా ఆత్మస్ఫూర్తి మనకు పోరాటశక్తి
### సర్వజన్ వికాస్ మంచ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్

**చిక్కడపల్లి నవంబర్ 16 (ప్రభాతవార్త):** బిర్సా ముండా ఆత్మస్ఫూర్తి మనకు పోరాటశక్తి, స్వాభిమానం ఇచ్చిందని సర్వజన్ వికాస్ మంచ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా గిరిజన హక్కులపై తీవ్ర ఆందోళన చేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. గిరిజన హక్కులు, వనరుల రక్షణ, అభివృద్ధిపై కీలక అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారని, దేశ గిరిజనుల మూల హక్కులైన జల్ జంగల్‌జమీన్.. నిరంతరం ప్రమాదంలోకి నెడబడ్డాయని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో 1996 పి.ఈ.ఎస్.ఏ చట్టం సక్రమంగా అమలు కావడం లేదని తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సభలకు కల్పించిన అధికారం భూమి, అటవీ సంపద రక్షణలో కీలకమని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని,స్థానిక గిరిజనులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 100 శాతం రిజర్వేషన్ అమలుచేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల జీవన స్థితిని మెరుగుపరిచేందుకు నాణ్యమైన విద్య, వైద్యం, రవాణా, తాగునీటి సదుపాయాలు పెంచాలని, గిరిజన మహిళల భద్రత, సాధికారత కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ఏజెన్సీ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అత్యంత దుర్వస్థితిలో ఉన్నాయని, అటవీ హక్కుల చట్టం కింద గిరిజనులకు వ్యక్తిగత మరియు సామూహిక అటవీ హక్కులు ఇవ్వడంలో ఆలస్యం జరుగుతోందని సీరియస్‌గా పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులు గిరిజన సంక్షేమ వసతి గృహాలు మరియు గురుకులాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, భోజనం నాణ్యత, వసతి గదులు, పరిశుభ్రత, ఉపాధ్యాయుల లోపం వంటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## ఐటిడిసి మీట్ అండ్ గ్రీట్‌కు కళారంగానికి ఆహ్వానం

**రవీంద్రభారతి, నవంబరు 16 ప్రభాతవార్త :** అంతర్జాతీయ సంప్రదాయ నృత్య మహాసభ ఐటిడిసి ప్రపంచ నలుమూలల నుండి వచ్చిన కళాకారులు ఒకచోట కలుసుకుని భారతీయ నాట్యంపై పలువురు గురువులు, టీచర్లను కలుసుకుని మీట్ అండ్ గ్రీట్‌పేరున చర్చించుకునేందుకు యావత్ కళారంగాన్ని ఆహ్వానిస్తున్నట్లు ప్రముఖ నాట్యగురువు డా. కళాకృష్ణ, ఐటిడిసి నేషనల్ కో ఆర్డినేటర్ భారతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అద్భుతమైన కార్యక్రమాన్ని 2026 జనవరి 2నుండి 4వరకు 3రోజులపాటు జరిగే ఐటిడిసి వేడుకల కోసం చర్చకు ఆహ్వానిస్తున్నట్లు వారు వెల్లడించారు. ఈమేరకు ఈరోజు 17 సోమవారం సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం జరగనుందని, ఆసక్తిగలవారు పూర్తి వివరాలకు 8500484484 సంప్రదించవచ్చునని వారు తెలిపారు. ఇప్పటికే చేరిన శాస్త్రీయ, జానపద గురువులకు, టీచర్లకు, నృత్యకళాకారులకు హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నామని చెప్పారు.



మంత్రి శ్రీధర్‌బాబుకు పుష్పగుచ్చాలు అందిస్తున్న నవీన్‌యాదవ్

## మంత్రులను కలిసిన నవీన్‌యాదవ్

**జూబ్లీహిల్స్, నవంబరు 16, ప్రభాతవార్త :**
జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలు పొందిన నవీన్‌యాదవ్ ఆదివారం పలువురు మంత్రులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కలిసి వారికి పుష్పగుచ్చాలు అందించారు. మెజార్టీ ఓట్లు సాధించడంలో డివిజన్ల వారీగా ఇంఛార్జిలుగా ఉన్న మంత్రులు అందించిన సహకారానికి నవీన్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజక వర్గ అభివృద్ధికి అవసరమైన నిధులను అందించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు మంత్రులు హామినిచ్చారన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తామని నవీన్‌యాదవ్ స్పష్టం చేశారు. ఆయనతోపాటు కాంగ్రెస్ నేతలు గొంటి సాయినాథ్‌యాదవ్, డి. సాయినాథ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

### గీత కార్మికుల కుటుంబాలకు చెల్లించాల్సిన
## బకాయిలను తక్షణమే విడుదల చేయాలి
### రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్

**హైదరాబాద్, నవంబర్ 16(ప్రభాతవార్త):** గీత వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రమాదవశాత్తు చెట్టు మీద నుంచి పడిన, వికలాంగుల గీత కార్మికుల కుటుంబాలకు చెల్లించాల్సిన రూ. 13 కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని, వృత్తి పెన్షన్ రూ.5వేలకు పెంచాలనే డిమాండ్ తో ఈ నెల 22న హైదరాబాద్, బషీర్ బాగ్, ప్రెస్ క్లబ్ లో రాష్ట్ర సదస్సును నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ తెలిపారు. గీత పని వారల సంఘం రాష్ట్ర సదస్సుకు సంబంధించిన గోడ పత్రికను, కరపత్రాన్ని హైదరాబాద్, హిమాయత్ నగర్, బహదూర్ గౌర్ హాల్ లో ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ గీత పని వారల సంఘం రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిథిగా రవాణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, గౌరవ అతిథులుగా మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట్ రెడ్డి, వక్తలుగా ఎస్.టి.యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి. సుధాకర్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర వృత్తి సంఘాల ప్రధాన కార్యదర్శి టి.వెంకట్రాములు, గౌడ ఐక్య సాధన కమిటీ అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్ హాజరుకానున్నట్లు వివరించారు. రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు,మాజీ ఎంఎల్ఏ, ఎంపి బొమ్మగాని ధర్మభిక్షం కాంస్య విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పైన ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర గీత పారిశ్రామిక ఆర్థిక సహకార కార్పొరేషన్లకు నిధులు ఇవ్వాలని, ఎన్నికలను నిర్వహించాలని తెలిపారు. రాజ్యాంగ సవరణ ద్వారా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిలు గౌడ్, రాష్ట్ర సమన్వయ కార్యదర్శి బి.నాగభూషణం, రాష్ట్ర కార్యదర్శి మారగోని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

# సంస్కృతి సంప్రదాయాలు కాపాడడంకంటే మించిన సేవ మరొకటిలేదు

### మాజీ జెడి లక్ష్మీనారాయణ

**నాంపల్లి, నవంబరు 16 ప్రభాతవార్త :**
భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళలను కాపాడడంకంటే మించినసేవ మరొకటి లేదని మాజీ జెడి వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. 16 సంవత్సరాలు ఈ సేవచేస్తూ చిన్నారులను చక్కగా శుశిక్షకులుగా తీర్చిదిద్ది వారిలో సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబింపజేస్తూ మంచి సమాజనిర్మాణానికి తోడ్పడుతున్న తరంగిణి సంస్థ, డైరెక్టర్ నృత్యగురు పద్మజావిశ్వాస్, పిల్లల తల్లిదండ్రులను ఎంతగానో అభినందించారు. చిన్నారుల అపూర్వ నృత్యప్రదర్శనలు అనిర్వచనీయమని వారికి శుభాశీస్సులందజేశారు. భారతీయ శాస్త్రీయ సంగీత నృత్యకళలు ప్రాచీనవిద్యలని, మన అపూర్వ సంస్కృతిలో భాగాలని, వాటిని తరతరాలకు అందించేందుకు మూలకారకులైన తల్లిదండ్రులు ఎంతో అభినందనీయులని తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్.రామచద్రరావు అన్నారు. ఈరోజు చిన్నారుల నాట్యప్రదర్శనలు అద్భుతం, వారి ప్రతిభకు మచ్చుతునకలని, వారికి శిక్షణిచ్చిన గురువు పద్మజా విశ్వాస్ కళాసేవ అద్వితీయమని కితాబునిచ్చారు. ప్రముఖ సంగీత



కళాకారులు, నాట్యగురువులతో జెడి లక్ష్మీనారాయణ, రామచంద్రరావు తదితరులు

నృత్య అకాడమీ తరంగిణి ఆధ్వర్యంలో బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో సంస్థ 16వ వార్షికోత్సవ వేడుకలు సంస్థ డైరెక్టర్ ప్రముఖ ఆధ్యాత్మిక, సంప్రదాయ జానపద గాయని డా. పద్మజ విశ్వాస్ నేతృత్వంలో యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ సభాధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిబిఐ పూర్వ జాయింట్ డైరెక్టర్ వి.వి. లక్ష్మీనారాయణ, తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావులు, విశిష్టఅతిథులు పి.సంధ్యారాణి, ఎ.రాధాకుమారి, మయూరి రాధ, మహేందర్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనం చేసి వేడుకలను ప్రారంభించి ప్రసంగించారు. చివరిగా నేటి కళాప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులను, వారి గురువులను ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు. సంస్థ, డైరెక్టర్ పద్మజా విశ్వాస్ కళాసేవను కొనియాడారు.

## బీహార్ ఎన్నికల స్ఫూర్తితోనే తెలంగాణలో పాగా వేయాలి : ఇబ్రం శేఖర్

**సైఫాబాద్, నవంబరు 16 ప్రభాతవార్త:** ఇటీవల బీహార్ రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో రాంఘడ్ నియోజకవర్గం నుంచి సతీష్ కుమార్‌సింగ్‌యాదవ్ విజయం సాధించారు. ఈ సందర్భంగా తెలంగాణ బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రం శేఖర్ బీహార్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం నాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ బిహార్‌లో మాజీ ముఖ్యమంత్రి సందేశం బహుజన విజయానికి నాంది పలికిందన్నారు. బిహార్‌లో జరిగిన మార్పు తెలంగాణ రాష్ట్రంలో పునరావృత్తం అవుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వాల నిరంకుశ పాలనను అంతమొందించి, బిఎస్‌పి తెలంగాణలో పూర్తి మెజార్టీతో అధికారంలోకి వస్తుందని ఆయన అశాభావాన్ని వ్యక్తం చేశారు. మాయావతి చూపిన మార్గంలోనే బిఎస్‌పి శ్రేణులంతా సర్వజన సుఖాయ్ లక్ష్యం కోసం నిస్వార్థంగా పనిచేసి రాష్ట్రంలో బహుజన రాజ్యాన్ని సాధిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను త్వరలో ప్రజల దృష్టికి తీసుకువెళ్ళేందుకు చైతన్యయాత్రను నిర్వహిస్తున్నామన్నారు.

### అయ్యప్పస్వామి దేవాలయంలో మండల పూజలు ప్రారంభం
### పూజామహోత్సవంలో పాల్గొన్న నవీన్‌యాదవ్



ఆలయం కమిటీ సభ్యులతో నవీన్‌యాదవ్

**జూబ్లీహిల్స్, నవంబరు 16, ప్రభాతవార్త :** శ్రీనగర్‌కాలనీలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం, భ్రమరాంబిక మల్లికారుజన స్వామి దేవస్థానంలో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం మండల పూజా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన నవీన్‌యాదవ్ ముఖ్యఅతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడున్న గోశాలను సందర్శించారు. ఆలయంలో అందిస్తున్న సేవలను, సౌకర్యాలను ఆలయ కమిటీ ఛైర్మన్ సిపిరి అర్జున్‌యాదవ్, ఈవో ఎం.శ్రీనివాసశర్మలతోపాటు పాలకమండలి సభ్యులు వివరించారు. ఈ సందర్భంగా ఆలయంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, అందుకు అవసరమైన నిధుల వివరాలను ఆయనకు వివరించారు. అనంతరం మండల పూజల్లో పాల్గొన్నారు. అయ్యప్పస్వాములను ఆప్యాయంగా పలకరించి వారికి భోజనం వడ్డించారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని ఆయన కోరారు. మండల పూజల్లో భాగంగా అయ్యప్పస్వామి దేవాలయంలో ఉదయం మహాగణపతి హోమం నిర్వహించారు. అనంతరం అభిషేకం, పడిపూజ, భజన, హరివారసనం, అల్పాహారం తదితర పూజా కార్యక్రమాలను శ్రీనివాసగురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు.

## బాధితులకు ఎల్‌వోసి మంజూరు పత్రాలు అందజేత

**జీడిమెట్ల, నవంబరు 16, ప్రభాతవార్త :** ఆపద సమయంలో ఆరోగ్య రక్ష ఎల్వోసీ బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. ఆదివారం 130 సుభాష్ నగర్ డివిజన్ సూరారంకు చెందిన బోగిని రవి, సబేరా భానులు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని స్థానిక బిఆర్ఎస్ నాయకుల ద్వారా తెలుసుకున్న బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి బాధితులకు ఆర్థిక సహాయానిన మంజూరు చేయించారు. మంజూరైన ఆర్థిక సహాయాన్ని ఆదివారం బోగిని రవి రూ.1,50,000, సబేరా భాను రూ.75,000 చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో డివిజన్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు ఎల్వోసీ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపద సమయంలో ఆరోగ్య రక్ష ఎల్వోసీ అని, అత్యవసర సమయంలో ఆసుపత్రి వైద్యానికి అర్హులైన ప్రతీ ఒక్కరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, నాయకులు బలరామ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శివాజీ, ఇస్మాయిల్, గుబ్బల లక్ష్మీ ్మనారాయణ, ప్రభాకర్, శివా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన హన్మంత్‌రెడ్డి

**నిజాంపేట్, నవంబరు 16, ప్రభాతవార్త :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి సెంట్రల్ స్కూల్ నుండి జగన్ స్టూడియో వరకు ఉన్న రహదారి పూర్తిగా పాడువటంతో ట్రాఫిక్ సమస్యలు, ఆక్సిడెంట్స్ జరుగుతున్నవి అని కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది అవుతుండడంతో నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిని సంప్రదించారు. వారి సమస్యపై స్పందించిన ఆయన సీసీ రోడ్, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు నిధులు మంజూరు చేయించారు. మంజూరైన నిధులతో ఆదివారం 22వ డివిజన్ అధ్యక్షులు వరగాని వాసు ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని, ఎన్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడా శ్రీనివాసరావు, ఆలేటి శ్రీనివాసరావు, సాంబశివరావు, వీరయ్య, మధు, సత్య , బాల్ రెడ్డి, మల్లేష్ మఠం, కాలనీ వాసులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న హన్మంత్‌రెడ్డి

## బెట్టింగులకు బానిసైన కానిస్టేబుల్
### లోన్ డబ్బులు తీసుకుని ఇంటి నుంచి అదృశ్యం..

**హైదరాబాద్ నవంబరు 16, ప్రభాతవార్త**

బెట్టింగ్ భూతానికి బలవుతున్నవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. పోలీసులు, ప్రభుత్వం బెట్టింగ్‌పై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ జనాల్లో మార్పు రావడం లేదు. హైదరాబాద్‌లో బెట్టింగులకు బానిసైన ఓ కానిస్టేబుల్ ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి..రహ్మత్ నగర్‌కి చెందిన రమేష్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బెట్టింగులకు బానిసైన రమేష్ అప్పులు చేశాడు. ఈక్రమంలో లోన్ డబ్బులు తీసుకొని ఇంట్లో నుంచి వెళ్ళిపోయాడు రమేష్. రోజులు గడుస్తున్నా రమేష్ ఇంటికి తిరిగి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది అతని భార్య. రమేష్ భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. మెదక్ జిల్లాలోని చాలా గ్రామాల్లో జనం ఆన్లైన్ గేమ్స్ బారిన పడుతున్నారు. నిజాంపేట మండలంలోని ఒక్క చల్మెడ గ్రామంలోనే సుమారు 20 మంది యువకులు ఒకరిని చూసుకుంటూ ఒకరు ఆన్లైన్ పేకాట, బెట్టింగ్ యాప్స్ డౌన్లోడ్ చేసుకొని పైసలు పెట్టి భారీగా నష్టపోయారు.మొదట్లో వందలు పెడ్తా వేలు రావడంతో ఇదేదో లాభసాటిగా ఉందని నమ్మిన బాధితులు.. చివరకు లక్షల రూపాయలు తెచ్చి పెట్టే స్థాయికి చేరారు. భారీ మొత్తంలో పెట్టిన డబ్బులన్నీ కోల్పోవడంతో ఎలాగైనా తిరిగి రాబట్టుకోవాలన్న ఆశతో అప్పు చేసి మళ్లీ పెట్టుబడి పెట్టడం ద్వారా అప్పుల ఊబిలో కూరుకుపోయారు. చల్మెడ గ్రామానికి చెందిన ఒక్కో యువకుడు రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు అప్పులపాలయ్యారు. అప్పులవాళ్ల వేధింపులు భరించలేక తల్లిదండ్రులు తమకున్న ఎకరా, అర ఎకరం పొలాన్ని అమ్మి కొడుకులు చేసిన అప్పులు తీరుస్తున్నారు.




నృత్యగురువులను సత్కరిస్తున్న వసుంధర, వేమరాజు విజయకుమార్

## దేశ సంస్కృతికి ప్రతిబింబం శాస్త్రీయ సంగీత నృత్యకళలు : వసుంధర

**నాంపల్లి, నవంబరు 16 ప్రభాతవార్త :** దేశ సంస్కృతికి ప్రతిబింబాలు భారతీయ శాస్త్రీయ సంగీత నృత్య కళలలేనని రాష్ట్ర ఖజానా, లెక్కలశాఖ ఉపసంచాలకురాలు జి.వసుంధర అన్నారు. ఆరున్నర దశాబ్దాలకుపైగా నవ్య నాటక సమితి జాతీయస్థాయిలో శాస్త్రీయ సంగీత నృత్యపోటీలను నిర్వహిస్తూ యువకళాకారులను ప్రోత్సహిస్తుండడం హర్షణీయమని ఆమె అభినందించారు. 9 రోజులపాటు జరిగే సంగీత నృత్యోత్సవం అపూర్వ సమ్మేళమని అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, సంగీత నాటక అకాడమీల సౌజన్యంతో నాంపల్లిలోని సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో నవ్యనాటకసమితి నిర్వహిస్తున్న 50వ అఖిల భారత సంగీత నృత్యపోటీల రెండవరోజు ముఖ్యఅతిథిగా జి.వసుంధర పాల్గొని కూచి పూడి నృత్యగురువులు డా. బిందుఅభినయ్, పావని శ్రీలత, జె.నాగవల్లిక లను సంస్థ అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సింగరాజు లక్ష్మి, సుధా రాణి, సత్యవాణి, డా. ఇందిరాహేమ, ఎం.కులకర్ణి, నిష్టల సుధామాల తదితరులతో కలిసి ఘనంగా సత్కరించి ప్రసంగించారు. ఈరోజు కూచిపూడి నృత్యంలో జూనియర్ విభాగంలో పోటీలు జరిగాయి.

## ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి : ఎమ్మెల్యే



హనుమాన్ దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, నవంబరు 16 ప్రభాతవార్త:** ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ అన్నారు. ఆదివా రం తాడ్‌బంద్ శ్రీహన్‌మాన్ దేవాలయంలో నిర్వహించిన అన్నకూట మహోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యజ్యోతి సందర్శనం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ, వేద పండితులు ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు ఆశీర్వచనం చేసి ఘనంగా సత్కరించారు.

## క్రీడాకారులను ప్రోత్సహించాలి : జంపన ప్రతాప్



క్రీడాకారులను అభినందిస్తున్న జంపన ప్రతాప్

**కంటోన్మెంట్, నవంబరు 16 ప్రభాతవార్త:** క్రీడాకారులను ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. 29వ గేమ్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో బోయిన్‌పల్లి కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన కబడ్డీ క్రీడా పోటీల్లో పాల్గొన్న విజేతలకు జంపన బహుమతులు, మెడల్స్ ప్రదానం చేశారు. అదేవిధంగా ఎంకెఆర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ద్వారక్ మణితోపాటు కబడ్డీ క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెజ్లింగ్ కోచ్ సాయిబాబాయాదవ్, కరన్‌సింగ్, శివ, అరుణ్ యాదవ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో సత్తాచాటిన జెల్లి సిస్టర్స్



బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు అన్విక, ఆకృతిలు

**నార్సింగి, నవంబరు 16 ప్రభాతవార్త:** 9వ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో నార్సింగికి చెందిన జెల్లి సిస్టర్స్ బంగారు పతకాలు సాధించి, నిర్వాహకులతో శభాష్ అనిపించుకున్నారు. కరాటే కోచ్ ప్రసాద్ నార్సింగికి చెందిన జెల్లి అన్విక, ఆకృతిలకు కరాటేలోని అన్ని మెళకువలు ఒంటబట్టిస్తూ, మెరికల్లా మారుస్తున్నారు. దీంతో పాల్గొన్న ప్రతీ కరాటే పోటీల్లో ఈ అక్కా చెల్లెలు ఇద్దరూ బంగారు పతకాలు సాధిస్తూ వస్తున్నారు. మియాపూర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం మరోమారు తమ ప్రతిభను చాటుకొని ఇద్దరూ బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. అంతర్ రాష్ట్రీయ కరాటే పోటీలకు వీరు అర్హత పొందారని, త్వరలో జరుగబోయే ఆ పోటీలకు వీరిద్దరిని తీసుకెళ్తానని కోచ్ ప్రసాద్ తెలిపారు. ఇద్దరు చిన్నారుల ప్రతిభ నాకు ఆనందాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

### ఏసిపి సుబ్బయ్య

**కంటోన్మెంట్, నవంబరు 16 ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సమయాల్లో పోలీసులకు సమాచారం అందించేందుకు 100కు డయల్ చేయాలని గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య తెలిపారు. ఈస్ట్ మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాలలో నిర్వహించిన సైబర్ నేరాల నిరోధంపై విద్యార్థినీలకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సైబర్, ఆన్‌లైన్ వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు పోలీసులను ఆశ్రయించాలన్నారు. అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అదే విధంగా వ్యక్తిగత సమాచారాన్ని ఆన్‌లైన్‌లో, ఫేస్ బుక్‌లో పంచుకోవడంపై జాగ్రత్త పడాలన్నారు. ఆపద సమయాల్లో పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డిఐ శ్రీనివాస్, రామక్రిష్ణ, ఎస్ఐలు కిరణ్ కుమార్‌రెడ్డి, యశోదర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న ఏసీపీ సుబ్బయ్య

# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**సంజీవరెడ్డినగర్, నవంబరు 16 ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం అమీర్‌పేట డివిజన్‌లోని శివబాల్ కాలనీలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హాస్టల్ విద్యార్థులకోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకొని వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, లయన్స్ క్లబ్ గవర్నర్ అమర్‌నాథ్, బిఆర్ఎస్ నాయకులు అశోక్‌యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పీయూసు గుప్తా, రామ్ నివాస్ బన్సాలు, గుడిగే శ్రీనివాస్‌యాదవ్, జితేందర్‌శుక్లా, గౌతమ్, మధు, నిర్వాహకులు ప్రదీప్ అగర్వాల్, మహేందర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

**వన భోజనంలో తలసాని...**

పవిత్ర కార్తీక మాసంలో ఏర్పాటు చేసుకునే వన భోజనాల ద్వారా మరింత ఐక్యత పెంపొందుతుందని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.




మాట్లాడుతున్న తలసాని

ఆదివారం సనత్‌నగర్‌లోని గ్రీన్‌పార్కు 2లో కార్పొరేటర్ కొలను లక్ష్మిబాల్‌రెడ్డి,క్యావెల్ స్కూల్ గ్రౌండ్ లో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక వనభోజన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రీన్‌పార్కు 2లో ఉసిరి చెట్టుకు ముందుగా పూజలు నిర్వహించారు. అనంతరం వన భోజనాలకు వచ్చిన వారికి బోజనాన్ని వడ్డించారు. అదేవిధంగా పద్మాశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పద్మాశాలీలకు ఏ అవసరం వచ్చినా తన సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మి, బిఆర్ఎస్ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, నాయకులు ఖలీల్, రాజేశ్‌ముదిరాజ్, ఫాజిల్, వసీం, సీనియర్ సిటిజన్స్‌కౌన్సిల్ సభ్యులు పార్థసారథి, మానిక్‌రావ్ పాటిల్, అనంత రెడ్డి, పుష్పలత,పద్మ, పద్మశాలి సంఘం నాయకులు భద్రయ్య, లక్ష్మినారాయణజయరాజ్ పాల్గొన్నారు.



విహెచ్‌ను సన్మానిస్తున్న అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు

## ఘనంగా అంబర్‌పేట బొడ్రాయి నాభిశిల వేడుకలు

**హైదరాబాద్, నవంబరు 16 ప్రభాతవార్త:** అంబర్‌పేట బొడ్రాయి నాభి శిల ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంటు సభ్యుడు వి.హనుమంతరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, దేవస్థాన సేవా సమితి సభ్యులు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, పంజాల గిరిధర్‌గౌడ్, బింగి మల్లన్నగౌడ్, రంగంపల్లి రాజు, సుధాకర్, కిషోర్, పంజాల వెంకటేష్‌గౌడ్, చింతల శ్రీనివాస్ ముదిరాజ్, సునీల్‌గౌడ్ బిందె శశిగౌడ్, సందీప్‌గౌడ్ భక్తులు పాల్గొన్నారు.

## శ్రీసత్యసాయిబాబా శతవార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, నవంబరు 16 ప్రభాతవార్త:** శివం ఆలయంలో శ్రీసత్యసాయి బాబా శత వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు అర్చనలు, భజనలు, సేవా కార్యక్రమాలు జరిగాయి. ఆదివారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబా దివ్య ఆశీర్వాదాలు స్వీకరించి, ఆలయ పరిసరాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో మొదటిసారిగా నిర్వహించిన అన్నదాన సేవా కార్యక్రమంలో పాల్గొని భక్తులకు సేవా ప్రసాదాలను అందజేశారు. ఈ

## పేదల సేవే లక్ష్యం: పట్నం రవీంద్రబాబు

**హైదరాబాద్, నవంబరు 16 ప్రభాతవార్త:** పేద ప్రజలకు సేవ చేయడమే పట్నం రవీంద్ర బాబు చారిటబుల్ ట్రస్ట్ ముఖ్య ఉద్దేశమని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ రవీంద్రబాబు అన్నారు. తీవ్ర చలి వ్యాపిస్తున్న నేపథ్యంలో అనాథ పిల్లలకు పట్నం రవీంద్ర బాబు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నగరంలోని ఓ అనాథ ఆశ్రమంలో పిల్లలకు దుప్పట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ పట్నం రవీంద్రబాబు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పేదల ప్రజల సేవే తమ ప్రధాన లక్ష్యంగా ట్రస్టు పనిచేస్తుందని పేర్కొన్నారు. తమ సేవలను అన్నివర్గాల పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.




దుప్పట్లను పంపిణీ చేస్తున్న పట్నం రవీంద్రబాబు తదితరులు

## మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

### డాక్టర్ సుంకరనేని అలేఖ్య

**చార్మినార్, నవంబరు 16 ప్రభాతవార్త :** మహిళలు ఆరోగ్యం పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని జంగమ్మెట్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుంకరనేని అలేఖ్య అన్నారు. సంస్కార్ సేవాఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉప్పుగూడలోని సాయికృప వసంత బంకెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మల్టీ స్పెషాలిటీ మెడికల్, ఐ క్యాంప్‌ను డాక్టర్ అలేఖ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవటంతో పాటు మంచి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. శ్రీరామ్ సూపర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జి.వి.ఎస్ అభిషేక్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ రోజు నడకతో పాటు వ్యాయామం చేయాలన్నారు. శాలిబండ రాజేష్ మెడికల్ యాజమాన్యం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్కార్ సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఆకుల శ్రీ రాములు,ప్రతినిధులు కె.చంద్రకుమార్, డి.ప్రభాకర్,తిరుపతి శివకుమార్, బి.ఉపేందర్, బి.హంసరాజ్, తిరుపతి శ్రీనివాస్ పాల్గొన్నారు. నాలుగు వంద మందికి వైద్య సేవలు లభించాయి.

## గ్రంథాలయంలో పోలీసుల అవగాహనా శిబిరం

**చిక్కడపల్లి, నవంబరు 16 ప్రభాతవార్త :** మొబైల్ లో ఏపికే ఫైల్స్ తో జాగ్రత్త..క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ చేస్తారు..అప్రమత్తంగా ఉండాలని చిక్కడపల్లి పోలీసుల ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో నగర గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి పొట్లూరి పద్మజ పాల్గొన్నారు. ఆదివారం అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయంలో చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ డిఐ శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ ఉపేందర్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఫోన్‌లోని సెట్టింగ్‌లో ఇన్‌స్టాల్ ఫ్రం అన్‌నోన్ సోర్సెస్(తెలియని వారి నుంచి) అనే ఆప్షన్‌ను డిజేబుల్ చేసుకోవాలని, దీంతో మన అనుమతి లేకుండా యాప్స్ ఇన్‌స్టాల్ కావు అని అన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ పోలీస్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ రాంబాబు, జోహ్రా ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

## సందడిగా కార్తీక వనభోజనాలు

**తార్నాక, నవంబరు 16 ప్రభాతవార్త :** కమ్మవారి సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజనాల కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాలలో ఉన్న కమ్మ కుటుంబాలు పెద్దఎత్తున పాల్గొన్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కార్తీక మాస వనభోజనాల విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయడంతో పాటు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు మందపాటి సురేష్ బాబు, కుందేటి వెంకటేశ్వరరావు, గటికంటి మురళీకృష్ణ, ఉన్నం శ్రీనివాసరావు, గుత్తికొండ శ్రీనివాసరావు, రావి జయధీర్, ఉన్నం వెంకటేశ్వర్లు, పోలవరపు శ్రీనివాసప్రసాద్, అడుసుమిల్లి చిట్టి వీరయ్య, నడిపినేని శేషాద్రి, వల్లభనేని వీరభద్రయ్య, జీజీ నాయుడు, కుర్రా నరసింహారావు పాల్గొన్నారు.

## అంబల్ల జనార్దన్‌కు సహృదయ సాహితీ పురస్కార ప్రదానం

**చిక్కడపల్లి నవంబరు 16 ప్రభాతవార్త:** తెలుగు సాహిత్యంలో వలస కార్మికుల జీవితాలను అక్షరీకరించిన ప్రముఖ తెలుగు కథా రచయిత అంబల్ల జనార్దన్ అని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య వెల్దండ నిత్యానంద రావు అన్నారు. ఆదివారం సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ (ఓరుగల్లు) ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డాక్టర్ అంబల్ల జనార్దన్ కు దివంగత ఒద్దిరాజు సోదరకవుల స్మారకార్థం ఏర్పాటు చేసిన"సహృదయ సాహితీ పురస్కారం 2025 సంవత్సరానికిగాను అంబల్ల జనార్దన్ రచించి ప్రచురించిన"ముంబై చూపుతో తెలుగు కథానికలు" అనే గ్రంథానికి ఉత్తమ కథా సాహిత్య పురస్కార, సహృదయ సాహితీ పురస్కార ప్రధానోత్సవ సభ జరిగింది. పురస్కారాన్ని ప్రదానం చేసిన అనంతరం వెలుదండ నిత్యానంద రావు మాట్లాడుతూ ముంబై నగరానికి చెందిన అంబల్ల జనార్దన్ బ్యాంకు ఉద్యోగ పనిచేస్తూనే తెలుగు సాహిత్యంలో కవిత్వం, కథానిక ప్రక్రియల్లో ముంబై నగరంలో సాహిత్య సేవ చేస్తున్నారనీ అన్నారు. సభలో ప్రముఖ రచయిత డాక్టర్ అంపశయ్య నవీన్, ప్రసిద్ధ విమర్శకులు కె పి.అశోక్ కుమార్, సంచిక అంతర్జాల పత్రిక సంపాదకులు కస్తూరి మురళీ కృష్ణ, నిర్వాహక సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ గన్నమరాజు గిరిజా మనోహర్, కె.కృష్ణమూర్తి, పురస్కార ప్రదాత వొద్దిరాజు విష్ణుప్రియ, సాహిత్య కార్యదర్శి మల్యాల మనోహర్ రావు తదితరులు పాల్గొన్నారు.



అంబల్ల జనార్దన్‌కు సహృదయ సాహితీ పురస్కార ప్రదానం చేసిన దృశ్యం



నందమూరినగర్‌లో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న బానుక నర్మద

## కంటోన్‌మెంట్ అభివృద్ధికి కృషి : నర్మద

**కంటోన్మెంట్, నవంబరు 16 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మదమల్లికార్జున్ తెలిపారు. ఆదివారం 6వ వార్డు నందమూరి నగర్‌లో 6 లక్షల వ్యయంతో చేపట్టనున్నభూగర్భ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీ ఈటెల రాజేందర్ సహకారంతో కంటోన్మెంట్ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తొన్నారు. రోడ్లు ,డ్రైనేజీ, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు బానుక మల్లికార్జున్, వార్డు అధ్యక్షుడు ప్రతీక్ జైన్, నరేందర్ పాల్గొన్నారు.

## వన భోజన యాత్రకు తరలివెళ్లిన ఆర్యవైశ్యులు




కార్తీక వన భోజన యాత్రకు వెళ్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

**అడ్డగుట్ట, నవంబరు 16 ప్రభాతవార్త:** కార్తీక వన భోజన యాత్రను పురస్కరించుకొని ఆదివారం తుకారాంగేట్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సిద్ధిపేట జిల్లా కొండపాక లోని శ్రీరామలింగేశ్వర స్వామి, కళ్యాణ వెంకటేశ్వర స్వామి వివిధ దేవాలయాలకు తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు శ్రీకాంత్ మాధవ్, ప్రధాన కార్యదర్శి నగబండి శ్రీనివాస్, కోశాధికారి నర్సింగ్ రావ్‌లతో పాటు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆమ్ ఆద్మీపార్టీతోనే సమస్యల పరిష్కారం

### రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్

**కుత్బుల్లాపూర్, నవంబరు 16 ప్రభాతవార్త :** ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ఆమ్ ఆద్మీపార్టీ నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ హాపీ చిల్డ్రన్స్ హాస్పిటల్ నుంచి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వరకు నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వివేకానందచారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కన్వీనర్ బుర్ర రాముగౌడ్, నాయకులు డాక్టర్ అన్సారీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కృషిచేస్తున్న ఆమ్ ఆద్మీ కార్యకర్తలు, నిర్వాహకులకు ఆయన అభినందనలు తెలిపారు. పార్టీ అధ్యక్షులు కేజ్రీవాల్ నాయకత్వంలో పార్టీని విస్తరింపచేసి దక్షనాది రాష్ట్రాలలో పార్టీగెలుపు లక్ష్యంగా కృషిచేస్తామన్నారు.

### బిసిల రిజర్వేషన్ అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరక్ష్యం

**చిక్కడపల్లి నవంబరు 16 (ప్రభాతవార్త) :** బీసీల రిజర్వేషన్ అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరక్ష్యం వహిస్తున్నాయని బీసీ డెమొక్రటిక్ జేఏసీ చైర్మన్ కోళ్ల జనార్దన్, జాతీయ కన్వీనర్ నాగమోని చెన్నరాములు మండిపడ్డారు. ఆదివారం బాగ్ లింగంపల్లిలో వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం అనంతరం 60 శాతం ఉన్న బీసీలకు జనాభా దామాషా ప్రకారం ఇవ్వకపోవడం అప్రజాస్వామికం అన్నారు. బీసీలకు బడ్జెట్లో వాటా దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపించి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్లో లో బీసీ బిల్లును ప్రవేశపెట్టి రాజ్యాంగ సవరణ చేసిన తమిళనాడు తరహాలో చట్టబద్ధమన రిజర్వేషన్లు అమలు స్త్రీ చేయాలని డిమాండ్చేశారు. సమావేశంలో సోషల్ డెమొక్రటిక్ జేఏసీ నేషనల్ వైస్ చైర్మన్ డాక్టర్ మేడి రమణ,ఇట్టె ప్రభాకర్, అంబాల నారాయణగౌడ్, దొమ్మాట వెంకటేశ్, సుదర్శన్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE:: RANGA REDDY DISTRICT COURTS:: AT KUKATPALLY
O.S.No.764 of 2022

Between:
**Mr. Komalla Vijay Deepak. ...Plaintiff.**
AND
**Mrs. Komalla Amrutha and others. ...Defendants.**

To,
1. **Mrs. Komalla Amrutha,** W/o. Late Mr. K. Yadaiah, aged about 52 years, Occupation: Housewife;
2. **Mrs. Komala Swarnalatha,** D/o. Late Mr. K.Yadaiah, W/o. Mr. N.Srikanth, aged about 35 years, Occupation: Housewife;
3. **Mr. Komala Mahender Nath,** S/o. Late Mr. K.Yadaiah, aged about 32 years, Occupation: Private Service;
4. **Mr. Komala Sai Nath,** S/o. Late Mr. K. Yadaiah, aged about 27 years, Occupation: Student; and
5. **Ms. Komala Sai Priyanka,** D/o Late Mr. K.Yadaiah, aged about 23 years, Occupation: Student;

All are residents of H.No. 5-36, Malabasthi, Dargah Hussain Shawali, Raidurg, Serilingampally Mandal, Ranga Reddy District-500 008.

Please take notice that, the Plaintiff has filed the above Suit for perpetual injunction against you and others. During the course of Trial, when the evidence affidavit of P.W.2 is sought to be served upon you, you are not attending the Hon'ble Court either in person or through Advocate, and even postal service is avoided by you when sent by registered post. Therefore, this publication is caused as a substitute service.

Hence, you are required to appear before the Hon'ble Senior Civil Judge, Ranga Reddy District Courts, at Kukatpally, either in person or through an authorised Advocate, on **02 nd day of December 2025, at 10.30 a.m.,** and attend the Trial in O.S.No.764 of 2022, as otherwise the said Suit would be adjudicated in accordance with law in your absence.

*(By Order of the Hon'ble Senior Civil Judge, Ranga Reddy District Courts, at Kukatpally)*

**Sd/- For M/s. B. SHASHIDHAR,**
**Advocates.**
**COUNSEL FOR THE PLAINTIF.**

# ప్రేమను పెంచుకుంటే పొందే ఆనందం అనిర్వచనీయం

### రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు రమణాచారి

**రవీంద్రభారతి, నవంబరు 16 ప్రభాతవార్త :** అసూయ కోపాలను పెంచుకోవచ్చు, ద్వేషాన్ని కల్పించుకోవచ్చు... ఇవన్నీబాధను కల్గించే అంశాలని, కానీ ప్రేమను పెంచుకుంటే పొందే సంతృప్తి చెప్పనలవికాదు, అక్షరాలు మాటలకందని అనిర్వచనీయ మహదానందమని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. ప్రేమ చిగురించిన శుభవేళ కథాసంపుటిని ఎంతో పెద్దమనస్సుతో తమకు అంకితమిచ్చిన రచయిత వెంకటదాసు పెద్దారి కాదు పెద్దమనస్సు వెంకటదాసు అని అభివర్ణించారు. వెంకటదాసు వృత్తిలో పోలీసు శాఖ అధికారిగా విధినిర్వహణలో కాఠిన్యత ప్రదర్శించాల్సి ఉందే కానీ మనస్సు వెన్నవంటిదని, అందుకే సమాజంలో నెలకొన్న సమస్యలే కథలుగా రూపుదిద్ది మంచి కథలు వ్రాస్తున్నారని అభినందించారు. జీవిఆర్ ఆరాధ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వి.వి.రాఘవరెడ్డి నేతృత్వంలో దాస్యం సేనాధిపతి సభాధ్యక్షతన రెడ్‌హిల్స్‌లోని డా. కె.వి. రమణాచారి క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన




కథాసంపుటిని రమణాచారి, పుష్పలత దంపతులకు అంకితమిస్తున్న దృశ్యం

ఆచార్య టి.గౌరీశంకర్ విశిష్ట అతిథులు పొత్తూరి సుబ్బారావు, రాధాకృష్ణ,రాధాకుసుమ, రఘువీర్, వంశీరామరాజు,హనుమంతరావు, మౌనశ్రీమల్లిక్ తదితరులతో కలిసి పెద్దారి వెంకటదాసు విరచిత ప్రేమ చిగురించిన శుభవేళ కథా సంపుటిని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి, పుష్పలత దంపతులను ఘనంగా సత్కరించి వారికి అంకితమిచ్చి ప్రసంగించారు. శంఖంలో పోస్తేనే నీరు తీర్థమైనట్లు కె.వి.రమణాచారి దంపతులకు అంకితమిచ్చిన తర్వాతే ప్రేమ చిగురించిన శుభవేళ కథాసంపుటి పునీతమై పవిత్రతను సంతరించుకుందని పొత్తూరి సుబ్బారావు వర్ణించారు. అనంతరం మిగతా అతిథులు మాట్లాడారు.

**PUBLIC NOTICE**

IN THE COURT OF HON'BLE III ADDITIONAL DISTRICT JUDGE RANGA REDDY DISTRICT AT : L.B.NAGAR
O.S.NO. 304 OF 2022

BETWEEN:
PRAMOD RAMRAKYANI ... PLAINTIFF
AND
J.PANDURANGAIAH and others ... DEFENDANTS

TO
2. J.NARASIMHAIAH, S/o.Late J.Shivaguruvaiah, Aged about 62 years, Occ: Business, R/o. Plot NO.40/B, Green Hills Colony, Road No.1, BanjaraHills, Hyderabad.
3. J.RAMULU, S/o.Late J.Shivaguruvaiah, Aged about 51 Years, Occ:Business, R/o. 18-66/B (G1), Chinnamma Vittalaiah Nilayam, Road No.4, Kamalanagar,Chaitanyapuri Cross Road, Hyderabad.
10. GONURU LAXMANA, S/o.Late G.Shankaraiah, Aged about 68 years, Occ: Business, R/o. 3-15-B2/24, Sahara Estates, Mansoorabad, L.B.Nagar, Ranga Reddy District.
13. SMT.JUNUMPALLY VANI, W/o.J.Ramulu, Aged about 47 Years, Occ: Housewife, R/o.18-66/B, Flat No.G1, Chinnamma Vittalaiah Nilayam, Kamalanagar, Gaddiannaram, Hyderabad - 500060.
14. SMT.THOTA RANI, W/o. Thota Raghunadham, Aged about 60 Years, Occ: Housewife, R/o 18-66 Flat No.G1, Chinnamma Vittalaiah Nilayam, Kamalanagar, Gaddiannaram, Hyderabad-500060.

**NOTICE**

The Plaintiff herein had filed the Suit for PERPETUAL INJUNCTION against the Defendants herein with regard to Suit Schedule Property. The Hon'ble Court had Ordered for publication of this Notice for appearance of Defendant Nos.2,3,10,13 and 14 in suit and the matter is posted to 28.11.2025. Therefore, you may appear before the Hon'ble III Additional District Judge, Ranga Reddy District at L.B.Nagar on 28.11.2025 at 10:30 A.M. either personally or through authorized Counsel or otherwise the matter will be adjudicated in due process of Law.
Hence, this Notice.

(BY ORDER OF THE COURT)
M/S RESU LAW OFFICE,8-2-293/82/158/A,MLA'S Colony Road No.12, Banajara Hills Hyderabad-500 034. Tel: 040-23558778/23568778, Email:resulawoffice@gmail.com

## గ్రామాల అభివృద్ధి బిజెపితోనే సాధ్యం

..బిజెవైఎం జిల్లా అధికార ప్రతినిధి ముల్తంకర్ శివాజీ..

**కేశంపేట, నవంబరు 16, ప్రభాత వార్త :** గ్రామాలు అభివృద్ధి చెందాలంటే భారతీయ జనతా పార్టీతోనే అధ్యమవుతుందని బ్రిజెవైఎం జిల్లా అధికార ప్రతినిధి ముల్తంకర్ శివాజీ అన్నారు. కేశంపేట మండల కేంద్రంలో వీధి దీపాలు లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఉమ్మడి పాలమూరు జిల్లా ఎంపి పికె అరుణ దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే స్పందించిన ఆమె కేశంపేట గ్రామానికి రెండు లక్షల యాభై వేల రూపాయల విలువైన హైమస్ట్ లైట్లు మంజూరు చేసారు. అడిగిన వెంటనే గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఎంపి డికె అరుణకు బిజెవైఎం జిల్లా అధికార ప్రతినిధి మల్తాంకర్ శివాజీ కృతజ్ఞతలు తెలిపారు.

## మృతురాలి కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం

**కేశంపేట, నవంబరు 16, ప్రభాత వార్త :** కేశంపేట మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామానికి చెందిన బోళ్ల మల్లమ్మ 55 గత ఆరునెలలనుండి అనారోగ్యం తో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. మల్లమ్మ మృతి చెందిన విషయాన్ని గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు అన్నెమోని మల్లేష్ యాదవ్ కేశంపేట తాజా మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే స్పందించిన ఆమె మృతురాలు కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ.5వేలు కాంగ్రెస్ గ్రామ కమిటి అధ్యక్షులు మల్లేష్ యాదవ్ ద్వారా అందజేశారు. మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన జడ్పిటిసి విశాల శ్రవణ్ రెడ్డికి, అందుకు సహకరించిన కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్‌కు మృతురాలు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లుగడ మల్లేష్ యాదవ్, అనేమోని జంగయ్య, హరికృష్ణ యాదయ్య, మంకల్ మల్లేష్, తదితరులు పాల్గొనారు.

## యువకుడు అదృశ్యం

**దుద్యాల్, నవంబరు 16, ప్రభాత వార్త :** దుద్యాల్ గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యం సంఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై యాదగిరి తెలి పిన వివరాలు ఇలా ఉన్నాయి. దుద్యాల్ గ్రామానికి చెందిన కుమ్మరి శివప్ప, స్వప్న లు గ్రామంలోనే వారి కుల వృత్తిని కొనసాగిస్తుంటారు. ఇటీవలే ముగిసిన వినాయక చవితికి మట్టి వినాయకుల ు తయారు చేశారు. ప్రతిసంవత్సరంలాగే వాటిని హైదరాబాద్ లోనే ఓ వ్యాపారికి విక్రయించారు. వాటికి సంబంధించిన డబ్బులు తీసుకు వస్తానని చెప్పి ఈ నెల 9న ఇంట్లో కుటుం బ సభ్యులకు చెప్పి వెళ్లాడు. 10న వ్యాపారి దగ్గర తనకు రావాల్సిన మొత్తం ను తీసుకుని రెండు రోజులు హైదరాబాద్‌లోనే గడిపాడు. మూడు రోజుల గడిచిన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా దైవ దర్శనానికి తిరుపతికి వెళ్తున్నట్లు చెప్పాడు. గురువారం తిరుపతిలో దేవుడి దర్శనం అయింది. మరుసటి రోజు మహబుబ్‌నగర్ మీదుగా ఇంటికివస్తున్నట్లు కుటుంబ సభ్యులకు ఫోన్లోసందేశం పంపాడు. వస్తాడని భావించిన కుటుంబ సభ్యులకు నిరాశే మిగిలింది. ఫోన్ కలువకపోవడం, ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అందోళన చెంది ఆదివారం పోలీసుల ు ఆశ్రయించారు. భార్య స్వప్న ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కడ్తాల్, నవంబరు 16, ప్రభాత వార్త :** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.

కడ్తాల్ మండల్ రావిచేడు గ్రామంలో బ్యాగరి రత్నమాల నూతన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశానికి ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంబించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు బ్యాగారి రాములు దంపతులకు కొత్త బట్టలు పెట్టడం జరిగింది. గూడులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడమే తమ లక్ష ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆమన్ గల్ వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ శ్రీమతి యాట గీత నర్సింహా ,జిల్లా అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి , ఆమన్ గల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా, కడ్తాల్ మండల అధ్యక్షులు బిచ్య నాయక్



, సింగల్ విండో డైరెక్టర్ చేగురి వెంకటేష్, డాక్టర్ శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు బొప్పిడి రాఘవేందర్, కుమ్మరి యాదయ్య, మాజీ సర్పంచ్ వరకల జనార్దన్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ సీనియర్



టిఫిన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

## యువత స్వయం ఉపాధితో ఎదగాలి

డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి

**కుల్కచర్ల,నవంబరు 16, ప్రభాత వార్త :** యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి,మార్కెట్ కమిటి చైర్మన్ బిస్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోనివిశాల్ టిపిన్ పెంటర్‌ను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...యువత ప్రవేట్ రంగాల్లో అదివస్తున్న అవకాశాను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ,మరింతమందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి గోపాల్ నాయక్,రాఘునాథ్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ రుక్మిణీపాండురంగ స్వామి కల్యాణోత్సవాలు

స్వామివారికి పట్టువస్త్రసాలు సమర్పించిన మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్

**ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 16, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ కొర్రెములలో శ్రీ రుక్మిణి పాండురంగస్వామి ఆలయ 40వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్వామి వారి కల్యాణోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ పాల్గొని వార్డు కార్యాలయం నుండి పట్టువస్త్రాలు, తలంబ్రాల బియ్యం,పుస్తేమట్లేలు, పూజసామాగ్రితో పురవీధుల గుండా ఊరేగింపుతో వచ్చి స్వామివారికి సమర్పించారు. శ్రీ కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఉపాసకులు శ్రీవాసుదేవశర్మగారి ఆధ్వర్యంలో హోమం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తజనసముహం తరలిరాగా స్వామి వారి కల్యాణోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్‌లు ఒరుగంటి వెంకటేశ్ గౌడ్, కవితాగౌడ్, స్థానిక నాయకులు చిలుకూరు సత్యనారాయణ, విశ్వనాథం, మహేంద్రాచారి, కందులరాజు, అమర్నాథ్ శ్రీనివాస్ రెడ్డి, నీరుడి శంకర్, శ్రీకాంత్,



కొర్రెముల గ్రామంలో జరిగిన శ్రీరుక్మిణీ పాండురంగస్వామి కల్యాణోత్స వేడుకల్లో పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ తదితరులు

విశ్వేశ్వర్‌రెడ్డి, పల్లె అయోధ్య, శ్రీకాంత్, రాజు. వెంకటేశం, లక్ష్మీనారాయణ, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కల్యాణోత్స వానికి విచ్చేసిన భక్తులకు సులోచన, నర్సింగ్‌రావులు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

## తప్పుడు ప్రచారాలకు

## మున్సిపాలిటీకి ఎలాంటి సంబంధం లేదు

మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్

**మేడ్చల్, నవంబరు 16, ప్రభాత వార్త :** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలతో ఇటీవల కాలంలో కొన్నిచోట్ల పత్రికలలో, సోషల్ మీడియాలో, స్థానిక వర్గాలలో ప్రచారంలోకి వచ్చిన వార్తల నేపథ్యంలో, ప్రజలు తప్పుదారి పట్టకుండా నిజమైన సమాచారం తెలుసుకోవడం అవసరమని మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న గేటెడ్ కమ్యూనిటీ నిర్మాణాలు, వాణిజ్య భవనాలు, విద్యాసంస్థల భవనాల అభివృద్ధిలో అధిక భాగం హెచ్ఎండిఎ నుండి చట్టబద్ధమైన అనుమతులు పొందిన తర్వాతనే నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. కొన్ని ఫైళ్లు హెచ్ఎండిఎ నుండి మున్సిపాలిటీకి సమయానికి అందకుండా ఉండటం వల్ల అనుమతుల గురించి అపోహలు కలిగే పరిస్థితి ఏర్పడినప్పటికీ, ఇది పరిపాలనా భాగంలో జరిగే సాధారణ సాంకేతిక లోపం మాత్రమేని పేర్కొన్నారు. దీన్ని అక్రమ కార్యకలాపాలకు అన్వయించడం తప్పని,అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టిన కొన్ని భవనాలపై మున్సిపాలిటీ ఇప్పటికే చట్టం ప్రకారం మొదటి, రెండో నోటీసులు జారీ చేసిందని తెలిపారు. వారు స్పందించకపోవడంతో, ప్రస్తుతం స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేసే ప్రక్రియ కొనసాగుతోందని, తదనంతరం జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ, హెచ్ఎండీఏ ద్వారా చట్ట ప్రకారం చర్యలు తీసుకునే ప్రక్రియ అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ ఎటువంటి రాజకీయ ఒత్తిడికి లోనవకుండా, పూర్తిగా నిబంధనల ప్రకారం మాత్రమే వ్యవహరిస్తోందని,కొంతమంది వ్యక్తులు, మధ్యవర్తులు, స్వలాభ ప్రయోజనాలు కలిగిన వర్గాలు మున్సిపల్ సిబ్బందిపై, ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న అధికారులపై తప్పుడు ఆరోపణలు చేస్తూ పరువు తీసే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. ఈ ప్రచారం పూర్తిగా నిరాధారమైనదని, మున్సిపాలిటీ ఎటువంటి వ్యక్తిగత సంబంధాల ఆధారంగా, ఒత్తిడులపై నిర్ణయాలు తీసుకోదని, చట్టంలో ఉన్న విధానాల ప్రకారం మాత్రమే నిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తుందని తెలిపారు. అనుమతులు లేని నిర్మాణాలకు నోటీసులు ఇస్తుందని,ఇదే సందర్భంలో, పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ అధికారికంగా రూ. 1,50,29,640ల రుసుము చెల్లించి భవన నిర్మాణ అనుమతి పొందిన సంస్థ అని స్పష్టంగా తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఆ సంస్థ నిర్మాణాలను అక్రమాలుగా చూపించడం వాస్తవానికి విరుద్ధమని,మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఏ నిర్మాణమైనా చట్టబద్ధంగా అనుమతులు ఉన్నంత వరకు మాకు ఎటువంటి అభ్యంతరం లేదని అన్నారు. అనుమతులు లేని నిర్మాణాలపై మాత్రం చట్టబద్ధంగా నోటీసులు జారీ చేసి, అవసరమైన చర్యలను తీసుకుంటున్నామని, తప్పుడు ప్రచార వార్తలకు మున్సిపాలిటీకి సంబంధం లేదని, ప్రజలకు నిజమైన సమాచారం అందాలని తాను కోరుకుంటున్నానని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక ధార్మిక సేవా సమితి 28న వార్షికోత్సవ వేడుకలు

# 108మంది పుణ్య దంపతులచే సామూహిక యజ్ఞాలు

..భగవంతుని సేవలో తరలించిన భక్తులు ..నిర్మలమైన మనస్సుతో భగవంతుడిని స్మరించాలి

..మళయాళ స్వామి ఆశ్రమ పీఠాధిపతులు శ్రీదయానందగిరి స్వాములు

**కొడంగల్,నవంబరు 16, ప్రభాత వార్త :** ఆధ్యాత్మిక ధార్మిక సేవా సమితి 28వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా మళయాళ స్వామి ఆశ్రమ పీఠాధిపతులు,షాద్‌నగర్ శ్రీదయానందగిరి స్వామిల అద్వర్యంలో 108 మంది దంపతులచే సామూహిక యజ్ఞ కార్యక్రమాలను నిర్వహించారు.హనుమాన్ చాలీసా పారాయణం,స్త్రీ సూక్తం,పురుష సూక్తం,శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం చేశారు.అనంతరం లక్ష్మీనారాయణ యజ్ఞం వేద మంత్రాలు పఠిస్తుండగా దంపతులు యజ్ఞ కార్యక్రమాలను నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్మలమైన మనస్సుతో భగవంతుడిని స్మరించాలని,దైవ కార్యాల నిర్వహణతోనే మానవ జన్మకు సార్ధకత లభిస్తుందని అన్నారు.ఇలాంటి యజ్ఞాలు నిర్వహించడం వల్ల పరిసర ప్రాంతాలు వాతావరణ కాలుష్య నివారణకు తోడ్పడుతుందని అన్నారు.భక్తిశ్రద్ధలతో యజ్ఞం నిర్వహించడంతో భక్తులు తరించారు.ఈ సందర్భంగా శ్రీదయానందగిరి స్వామిఎ కేఎస్‌వీ ఫంక్షన్‌హాలులు యజమాని మురారి వశిష్టను ,అన్నప్రసాద దాత నందారం మధులకు శాలువాలు కప్పుతూ ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో ఆధ్యాత్మిక ధార్మిక సేవా సమితి వ్యవస్థాపకులు,అధ్యక్షులు డాక్టర్ హీరాలాల్,డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రవీంద్ర యాదవ్,సమితి సభ్యులు నారాయణ,బాకారం మల్లయ్య, బాల్‌రాజ్, తుకారాం,పాండురంగయ్య,లాలప్ప,రామానంద్, కె.అనంతయ్య,శ్యాంసుందర్, కృష్ణ,వెంకటయ్య,బాకారం సాయిలు,బత్తుల మొగులయ్య,భక్తులు నందారం మధు,లక్ష్మీనారాయణగుప్త,మురారి వశిష్ట తదితరులు పాల్గొన్నారు.



యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు




మాట్లాడుతున్న పీఠాధిపతులు




.నగరంలో బిసి రిజర్వేషన్ల కోసం నిర్వహించిన రన్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యక్రమంలో బిసి నేతలతో పాల్గొన్న బిసి కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ రమేశ్‌గౌడ్ దృశ్యం

రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో

# బిల్లు పెట్టే వరకు పోరాటాలు

..రాష్ట్ర బిసి కార్మిక సంక్షేమ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ రమేశ్‌గౌడ్ ..బిసి రిజర్వేషన్ల కోసం నగరంలో జరిగిన రన్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యక్రమం ..పాల్గొన్న బిసి సంఘాల నాయకులు

**శామీర్‌పేట, నవంబరు 16, ప్రభాత వార్త :** బిసిలకు 42శాతం రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో బిల్లు పెట్టే వరకు బిసిల పోరాటాలు కొనసాగాలని బిసి కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ రమేశ్‌గౌడ్ అన్నారు. బిసి రిజర్వేషన్ల కోసం నగరంలో జరిగిన రన్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆదివారం శామీర్‌పేట మండల కేంద్రం నుంచి నగరంలో బషీర్‌బాగ్ చౌరస్తా నుంచి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు జరిగిన రన్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బిసి జేఏసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపు మేరకు దీనిలో చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి బిసి నేతలు పాల్గొన్నారు. దీనిలో వారితో పాటు బిఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సిహెచ్ రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ బిసిలు అందరు అనుకుంటే జుబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా గెలిచిన నవీన్‌యాదవ్ (కాంగ్రెస్)ను బిసిలు అందరు కలిసి విజయాన్ని అందించారని బిసిల మద్దతు ఇలానే ఉంటే బిసిలు అందరు ఏకమైతే రాష్ట్ర వ్యాప్తంగా బిసిలు విజయం సాధించనున్నట్లు తెలిపారు. బీహార్‌లోనూ బిసిలు అందరు ఐక్యంగా ఉండి బిజెపిని గెలిపించారని అన్నారు. ఇకనైనా బిసిలకు 42శాతం రిజర్వేషన్లు వచ్చేలా పార్లమెంట్‌లో బిల్లు పెట్టే విధంగా ఎంపిలు పోరాటం చేయాలని ఆయన కోరారు. పార్లమెంట్‌లో బిల్లు పెట్టే వరకు బిసిలు పోరాటం చేయాల్సిన అవసరం ఉందని డాక్టర్ రమేశ్‌గౌడ్ అన్నారు. దీనిలో పలువురు బిసి నాయకులు పాల్గొన్నారు.

## గీత వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి 22న ఛలో హైదరాబాద్

**శామీర్‌పేట, నవంబరు 16, ప్రభాతవార్త:** తెలంగాణ గీత వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 22న ఛలో హైదరాబాద్ కార్యక్రమం జరుగుతుందని, బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గీత పనివారల రాష్ట్ర సదస్సు జరుగుతుందని అందరు పాల్గొని విజయవంతం చేయాలని గీతపనివారల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ కోరారు. ఈ సందర్భంగ ఆయన శామీర్‌పేటలో మాట్లాడుతూ రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన రాష్ట్ర సదస్సు జరుగుతుందని అన్నారు. దీనిలో గీతవృత్తిదారులు, గీతపనివారలు, బిసి రాష్ట్ర నాయకులు, పార్టీలకు అతీతంగ అందరు పాల్గొనటం జరుగుతుందన్నారు. గీత వృత్తిదారుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకవెళ్లటానికి పరిష్కారం కోసం పలు నిర్ణయాలు తీసుకోవటం జరుగుతుందన్నారు. సుమారు 13కోట్ల రూపాయలు గీతపనివారల కుటుంబాలకు చెల్లించాల్సిన ఎక్స్‌గ్రేషియా బకాయిలు ఉన్నట్లు వెంటనే విడుదల చేయాలని కోరటం జరుగుతుందన్నారు. ఎక్స్‌గ్రేషియాను రూ.10లక్షలకు పెంచాలని, గాయాలు అయిన వారికి ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను



గీత వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి ఛలో హైదరాబాద్ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించిన రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి డిజి సాయిలుగౌడ్, సమన్వయ కార్యదర్శి బి.నాగభూషణం, తదితరుల దృశ్యం

రూ.2లక్షలకు పెంచాలని, గీతవృత్తిదారులకు ఇచ్చే పెన్షను రూ.5వేలకు పెంచాలని పలు అంశాలపై ఈ సదస్సులో నిర్ణయం తీసుకుని ప్రభుత్వానికి నివేధిక అందజేయనున్నట్లు ప్రధాన కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ తెలిపారు. నగరంలో 22న జరిగే ఈ సదస్సుకు గీతవృత్తిదారులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## వృద్ధాశ్రమంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న బిసా బాలరాజ్

బాలరాజ్‌ను దీవించిన ఆశ్రమ వృద్ధులు

**నందిగామ, నవంబరు 16, ప్రభాత వార్త :** ప్రార్థించే పెదవుల కన్నా.. సహాయం చేసే చేతులే మిన్న అంటారు. దేశం మనకేమిచ్చింది.. స్ వ దేశానికి మనమేమిచ్చామనేది ముఖ్యం. అని భావించిన నందిగామ అంబేద్కర్ కాలనీకి చెందిన బిసా బాలరాజ్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం నందిగామ శివారులో ఉన్న అనాథ వృద్ధుల ఆశ్రమంలో వారికి అన్న ప్రస్సాద, పండ్లు ,ఫలాలు ఇచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు. మానవసేవయే మాధవ సేవగా ఎంచుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బాల్ రాజును ఆశ్రమ వృద్ధులు, ఆశ్రమం నిర్వాహకులు, ప్రత్యేక ప్రార్థనలు చేసి నూరేళ్ల వర్ధిల్లమని దీవిస్తూ ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో బీస నర్సింగ్ రావు, పబ్బతి నర్సింగ్,పండు, సంజీవ, ఉమ్మెన్ తల సందీప్, బిసా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



అనాథ ఆశ్రమంలో వృద్ధులకు భోజన సదుపాయం కల్పించిన బాలరాజ్

## సమాజంలో పాత్రికేయుల పాత్ర కీలకం

మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజనేయులు

**కుల్కచర్ల, నవంబరు 16, ప్రభాత వార్త :** సమాజంలో పాత్రికేయులు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారని మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజనేయులు అన్నారు. అదివారం మండల కేంద్రంలోని జాతీయ పత్రికా దినోత్సం పురస్కరించుకొని ఇటివల (టియూడబూ జె)ఐజెయూ యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన సినియర్ రిపోర్టర్ శివకుమార్ గౌడ్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎల్లంపల్లి గ్రామానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ రాక

**షాద్‌నగర్, నవంబరు 16, ప్రభాత వార్త :** దళిత యువకుడు హత్యను నిరసిస్తూ సోమవారం ఫరూఖ్ నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామానికి సిపిఎం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ వస్తున్నట్లు సిపిఎం తాలూకా నాయకులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడతారని దళిత గిరిజన సంఘాల నాయకులు, వామపక్ష పార్టీల నాయకులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు వివిధ ప్రజా సంఘాల నాయకులు మధ్యాహ్నం రెండు గంటలకు ఎల్లంపల్లి గ్రామానికి రావాలని కోరారు.



సిపిఎం కార్యదర్శి జాన్ వెస్లీ

## శతమానం భవతి..!

**నందిగామ, నవంబరు 16, ప్రభాత వార్త :** నందిగామ మండలం అంతిరెడ్డి గూడ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ దేపల్లె కుమార్ గౌడ్ కుమారుని వివాహం శంషాబాద్ మల్లికా గార్డెన్ లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డిలు హాజరై నూతన వధూవరులు ప్రణయ్ గౌడ్ ప్రణీత లను అక్షి ంతలు వేసి ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో కొత్తూరు మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి, నందిగామ మాజీ ఎంపీపీ ఎం ప్రియాంక శివ శంకర్ గౌడ్ , మాజీ ఎంపీటీసీ మోడీ దర్శన్ , కొత్తూరు మాజీ సర్పంచ్ జె. సుదర్శన్ గౌడ్, నేతలు జిల్లెల్ల జనార్దన్ రెడ్డి, కడంపల్లి సదానంద్, పసుల బుచ్చయ్య, పలువురు రాజకీయ



వధు వరులను ఆశీర్వదిస్తున్న షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, తదితరులు.

# బి అలెర్ట్ ..ప్రమాదాల స్పాట్..!

## వేగనియంత్రణ బోర్డ్‌లు ఏర్పాటు చేయండి

**నందిగామ, నవంబరు 16, ప్రభాత వార్త :** ప్రయాణ మంటేనే ప్రాణ సంకటంగా మారిన పాత జాతీయ రహదారి నూజివీడు పరిశ్రమ ముందు ఉన్న యు టర్న్ డివైడర్ ప్రమాదాల స్పాట్ గా తయారైంది. పరిశ్రమలకు ముఖ్య కూడలిగా ఉన్న ఈ ప్రాంతం నిత్యం వచ్చీ పోయే వాహనదారులు యు టర్న్ చేసుకోవాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో పలుమార్లు ఈ స్పాట్ వద్ద ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ప్రమాదాలు జరగకముందే సంబంధిత శాఖ అధికారులు వేగ నియంత్రణ బోర్డులు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



నూజివీడు సీడు పరిశ్రమ ముందు యూటర్న్ వద్ద నిలిచిన వాహనాలు.

# ఉత్సాహంగా వనభోజనాలు

**మేడ్చల్, నవంబర్ 16. ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని మల్లన్న దేవాలయ ఆవరణలో గౌరీ సేవా సంఘం, తెలంగాణ రాష్ట్ర నూకాంబిక ఉత్సవ కమిటి ఆధ్వర్యములో వనభోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లల ఆటపాటలు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, బతుకమ్మ, కోలాటం ఆటలు చేపట్టారు. అనంతరం ఉత్తమ ప్రదర్శన చేసిన వారికీ బహుమతులు అందజేశారు. స్థానికులతో కలిసి వజభోజనాలు చేసి చివరగా స్థానిక పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో రైల్వే శాఖ డీజీ అరోమా సింగ్ తకూర్, ప్రిన్సిపల్ నిర్మల రాజారామ్, మాజీ కౌన్సిలర్ దొడ్ల మల్లిఖార్జున్ ముదిరాజ్, యడవ సంఘం అధ్యక్షులు రాము యాదవ్, హరి కృష్ణ, జగ్గ రావు, జుబ్లీహిల్స్ అధ్యక్షులు సతీష్, కిష్ కుమార్ ప్రోగ్రాం ఆర్గనైజర్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న వనభోజన నిర్వహకులు